ఆంధ్రజ్యోతి
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శుక్రవారం 26 ఏప్రిల్ 2024

ముమ్మరంగా వాహనాల తనిఖీ

కడ్తాల్, ఏప్రిల్ 25 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కడ్తాల్‌లో పోలీసులు వాహనాల తనిఖీని ముమ్మరం చేశారు. గురువారం కల్వకుర్తి నుంచి హైదరాబాద్ వెళుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కారును ఆపి తనిఖీ చేశారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి వాహనాన్ని కూడా తనిఖీ చేశారు. సీఐ శివప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం, డబ్బు పంపిణీ చేయకుండా పక్కాగా నిఘా ఏర్పాటు చేశామన్నారు. తనిఖీలో ఎన్నికల టీం సభ్యుడు కసిరెడ్డి వినయ్, సమీర్, ఏఎస్సై బాల్‌రెడ్డి, కృష్ణయ్య, పీసీ మంజు తదితరులున్నారు.

భానుడి భగభగ.. కోళ్లు మృత్యువాత

- ఎండవేడిమి తట్టుకోలేక చనిపోతున్న వైనం
- కష్టంగా మారిన కోళ్లఫారాల నిర్వహణ
- చాలాచోట్ల వాటర్ ట్యాంకర్‌తో నీటి సరఫరా
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు

యాచారం, ఏప్రిల్ 25: బ్రాయిలర్ కోళ్ల పెంపకందారులు వేసవి కాలంలో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే పెట్టుబడికి చేసిన అప్పులతో సమతమతమవుతుండగా.. మరిన్ని అప్పుల చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. భానుడు భగభగలతో ఇప్పటికే జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా మూగజీవాలు తట్టుకోలేకపోతున్నాయి. బాయిలర్ కోళ్లఫారాలతో జీవనోపాధి పొందుతున్న చిన్న, సన్నకారు రైతులు అష్టకష్టాలపాలవుతున్నారు. ఎండవేడిమి తట్టుకోలేక కోళ్లు మృత్యువాతపడుతున్నాయి. సొసైటీలు, వాణిజ్య బ్యాంకుల్లో భూములను, బంగారు నగలను తాకట్టు పెట్టి రైతులు అప్పులు చేసి, బ్రాయిలర్ కోళ్ల పెంపకం చేపట్టారు. ఇంటిగ్రేటెడ్ చికెన్ కంపెనీల నిర్వాహకులు కోడి పిల్లలతో పాటు దాణా కూడా సరఫరా చేస్తుంటారు. ఒక్కొక్కటి రూ.4.50లకు సరఫరా చేస్తుండగా.. పదివేల కోళ్లను పెంచితే రైతుకు 45 రోజుల పాటు పెంచినందుకు గాను, కంపెనీ రూ.65వేల నుంచి లక్ష వరకు చెల్లిస్తుంది. అయితే, విద్యుత్ బిల్లు నెలకు రూ.7నుంచి రూ.8వేల వరకు వస్తుందని, కోడిపిల్లలకు రోగనిరోధక శక్తిని పెంచే ఇంజక్షన్ రెండుసార్లు వేస్తే కనీసం రూ.10 వేల వ్యయమవుతుందని తెలిపారు. కోళ్లఫారాల్లో పనిచేసే వారికి (దంపతులకు) నెలకు రూ.25 వేల వేతనం ఇవ్వగా.. ఒక్కో బ్యాచ్‌కు ఖర్చులు పోను చేతికందేది కేవలం రూ.20 నుంచి 35 వేలు మాత్రమేనని రైతులు వాపోతున్నారు. చాలాచోట్ల బోర్లు ఎండిపోవడంతో వాటర్ ట్యాంకర్‌కు రూ.1000 నుంచి రూ.1200లు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని, రెండు రోజులకోసారి నీరు తీసుకొస్తున్నట్లు చెబుతున్నారు. కాగా, మొత్తం మీద ఎండాకాలంలో నీటి కోసం అదనంగా రూ.22వేల వరకు ఖర్చవుతుందని తెలిపారు.

ఎండ తీవ్రతతో చనిపోతున్న కోళ్లు

గత 45 రోజులుగా భానుడు భగభగమంటున్నాడు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో షెడ్లలో వేడి అధికమై విక్రయానికి సిద్ధమైన కోళ్లు చనిపోతున్నాయి. దాంతో చికెన్ కంపెనీ సూపర్‌వైజర్ వచ్చి పరిశీలించే వరకూ వాటిని షెడ్డులోనే ఉంచాలి. ఈక్రమంలో దుర్వాసన భరించలేక మరిన్ని కోళ్లు చనిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల మండలాల్లో 680 బ్రాయిలర్ కోళ్లను పెంచే షెడ్లు (ఫారాలు) ఉన్నాయి. కాగా, 15 వేల కోళ్ల పెంచుతున్న షెడ్డు నిర్వహణకు నెలకు రూ.లక్షా 60వేల వ్యయమవుతుందని, కూలీల వేతనం, విద్యుత్ బిల్లులు, ఇంజక్షన్లు, వరి పొట్టు ఖర్చులన్నీ పోగా.. నెలకు చిల్లిగవ్వ కూడా అందడం లేదని రైతులు వాపోతున్నారు. బ్యాంకులకు వడ్డీ చెల్లించలేక ఇబ్బంది పడుతున్నామని, కంపెనీల నిర్వాహకులు చికెన్ ధరలు పెంచి ఆదుకోవాలని కోరుతున్నారు. కాగా, మూడు రోజుల క్రితం తమ్మలోనిగూడలో రైతు అయిలయ్య పెంచుతున్న దాదాపు మూడు వందల కోళ్లు(రోజుకు 150 చొప్పున) చనిపోయాయి.



తమ్మలోనిగూడలో చనిపోయిన కోళ్లు.. పక్కన రైతు అయిలయ్య(ఫైల్)

పెరుగుతున్న ఉష్ణోగ్రతలలో తీరని నష్టం

రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో తీరని నష్టం వాటిల్లుతోంది. ఎండ వేడిమికి విక్రయానికి సిద్ధంగా ఉన్న కోళ్లు చనిపోతుండడంతో ఏమీ చేయలేకపోతున్నాం. చికెన్ కంపెనీలు చొరవ తీసుకొని ధరలు పెంచి ఆదుకోవాలి. బాయిలర్ కోళ్లఫారం నిర్వాహణ కష్టంగా మారింది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

- బందె రాజశేఖర్‌రెడ్డి, రైతు, కుర్మిద్ద





పల్లకీ సేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

వైభవంగా వేంకటేశ్వరుడి పల్లకీ సేవ

- ముగిసిన చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 25: చిలుకూరు బాలాజీ ఆలయంలో వారం రోజులుగా వైభవోపేతంగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ మేరకు ఉదయం ఆలయ పరిసరాల్లో స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు. అదే విధంగా ధ్వజారోహణం, ఆలయం ముందు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆస్థానంలో అర్చకులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ సమీపంలోని గండిపేట చెరువులో స్వామివారి ఉత్సవమూర్తికి చక్రతీర్థం(స్నానం) నిర్వహించారు. అనంతరం గండిపేట నీటిని ఆలయ శుద్ధి కోసం ప్రధాన అర్చకుడు రంగరాజన్ భక్తులతో కలిసి తీసుకొచ్చారు. అనంతరం అభిషేకం నిర్వహించారు. దాంతో ఆలయ బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు రంగరాజన్ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొని సహకరించిన వివిధ శాఖల అధికారులు, పోలీసులు, గ్రామస్థులు, భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవాలు వేదపండితులు తిరుల కిరణాచారి, పురావస్తు రామాచారి ఆధ్వర్యంలో కొనసాగాయి. ఆలయ నిర్వహణ కమిటీ కన్వీనర్ గోపాల కృష్ణస్వామి, కన్నయ్య, సురేష్, అనిల్, నాగరాజు, పవన్ తదితరులు చిలుకూరు గ్రామస్థులు పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులకు చక్రతీర్థం నిర్వహిస్తున్న వేదపండితులు

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు కృషి

- నేటి నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ
- ఆర్డీవో సూరజ్‌కుమార్



కందుకూరు, ఏప్రిల్ 25 : లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు ఆర్డీవో, లోక్‌సభ ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి సూరజ్‌కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రంలో ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహేశ్వరంలో 5లక్షల 56వేల 741మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. ఈనెల 15 వరకు ఓటరు నమోదు ప్రక్రియ పూర్తయిందన్నారు. నియోజకవర్గ పరిధిలో చనిపోయిన, డబుల్ ఓట్లు ఉన్న 10వేల మంది పేర్లను జాబితా నుంచి తొలగించినట్లు చెప్పారు. శాసన సభ ఎన్నికల అనంతరం ఓటరు నమోదులో యువత శాతం మరింత పెరిగిందన్నారు. నేటి నుంచి ఐదు రోజుల పాటు బీఎల్వోల ద్వారా ఓటరు స్లిప్పులను ఇంటి వద్దకే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో 537 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఓటర్లకు నగదు పంపిణీ చేయకుండా ఎప్పటికప్పుడు నిఘాను పెంచినట్లు చెప్పారు. ఇందుకోసం మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గ పరిధిలో రూ.35.37 లక్షల నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ గురువారంతో పూర్తయిందని, నేటి నుంచి గట్టి బందో బస్తును చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కాలేజీల్లో ఈసారి ఇంటర్ పరీక్ష ఫలితాల్లో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం తగ్గిపోయింది. ఏటేటా ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలు కూడా తగ్గిపోతున్నాయి. పదో తరగతి వార్షిక పరీక్షలు పూర్తికావడమే ఆలస్యం.. తమ పిల్లలను ప్రైవేటు/కార్పొరేట్ కాలేజీల్లో చేర్పించేందుకే తల్లిదండ్రులు సంసిద్ధమవుతున్నారు. సర్కారు కళాశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ అడ్మిషన్లు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. దానికి తగ్గట్టుగానే విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం కూడా ఏటేటా తగ్గిపోతోంది. ఎంత ఖర్చయినా సరే ప్రైవేటు కాలేజీలో చదువుకునేందుకే విద్యార్థులు ఇష్టపడుతున్నారు. ఈ యేడాది జిల్లాలో ఇంటర్ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ కాలేజీ ఒక్కటి కూడా లేదు. కాగా, ఫస్టియర్ కంటే సెకండియర్‌లో ఉత్తీర్ణత శాతం కాస్త మెరుగ్గా ఉంది.





సర్కారు కాలేజీల్లో తగ్గిన ఉత్తీర్ణత

ఏటేటా ఇంటర్‌లో అడ్మిషన్లూ తక్కువే..

- ప్రైవేటు/కార్పొరేట్ కాలేజీలకే విద్యార్థుల మొగ్గు
- ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య కరువు!
- సకల సౌకర్యాలున్నా.. ఉత్తీర్ణత శాతం అంతంతే!

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 25) : ఇంటర్ ఫలితాల్లో సర్కారు జూనియర్ కాలేజీలు డీలాపడ్డాయి. ఫస్టియర్, సెకండియర్‌లోనూ ప్రైవేట్ కాలేజీలతో పోల్చుకుంటే.. అట్టడుగు స్థాయి చేరుకున్నాయి. ప్రభుత్వ కాలేజీలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ.. ఫలితాల్లో మాత్రం క్షీణిస్తున్నాయి. ఎంతో అనుభవం గల అధ్యాపకులు ఉన్నప్పటికీ.. ఫలితాల సాధనలో ఎందుకు పరుగులు పెట్టలేకపోతున్నాయనే ప్రశ్న తలెత్తుతోంది. లోపం ఎక్కడుంది? ఎందుకు విద్యార్థులు చదువులో రాణించలేక పోతున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అధికారులు పట్టించుకోపోవడంతోనే రోజురోజుకూ ప్రభుత్వ కాలేజీల్లో విద్యాప్రమాణాలు దిగజారిపోతున్నాయని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఒకప్పుడు ప్రభుత్వ కాలేజీలు అంటే ఎంతో క్రేజ్ ఉండేది. ప్రతీ ఒక్కరు ప్రభుత్వ కాలేజీలోనే చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకునేవారు. అలాంటి వారు ఎందరో ఉన్నారు కూడా. కానీ, ఇప్పుడు ప్రభుత్వ కాలేజీలంటేనే వామ్మో అని అంటున్నారు. గతంలో గవర్నమెంట్ కాలేజీలో సీటు కోసం పరితపించే వారు. నేడు ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు, ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నప్పటికీ.. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడంలో మాత్రం వెనకడుగు వేస్తున్నారు. ఓపక్క ప్రభుత్వ కాలేజీల్లో ప్రవేశాలు తగ్గిపోతుండగా, చేరిన వారిలోనూ పాస్ అవుతున్న వారిసంఖ్య దారుణంగా పడిపోతోంది. ఇక్కడ చదివే వారిలో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, పేదవర్గాల పిల్లలే. వారికి నాణ్యమైన విద్యనందించి, పైచదువులకు పంపించాల్సిన సర్కారు.. ఇంటర్‌తోనే సరిపెడుతోంది. ఏటా వేలాది మంది విద్యార్థులు ఇంటర్‌తోనే చదువుకు దూరమవుతున్నారు. ఇందుకు ప్రభుత్వ విధానాలతో పాటు వివిధ కారణాలు ఉన్నాయి.

రంగారెడ్డి జిల్లాలో మొత్తం 17 ప్రభుత్వ జూనియర్ కాలేజీలున్నాయి. ఫస్టియర్, సెకండియర్ ఫలితాల్లో కనీసం ఏ ఒక్క కాలేజీ కూడా వందశాతం ఉత్తీర్ణత సాధించలేదు. 50 శాతం ఉత్తీర్ణత సాధించిన కాలేజీల పేర్లను వేళ్లపై లెక్కించవచ్చు. మాడ్గుల జూనియర్ కాలేజీ ఫస్టియర్‌లో 80.47 శాతం ఉత్తీర్ణత మాత్రమే సాధించారు. అలాగే మంచాల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 50 శాతం, ఫరూక్‌నగర్ జూనియర్ కాలేజీ 53.54 శాతం, కేశంపేట మండలం కొత్తపేట జూనియర్ కాలేజీలో 62.5 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ఫస్టియర్ ఫలితాల్లో వెనుకబడిన కాలేజీలు..

ఫస్టియర్ ఫలితాల్లో చాలావరకు కాలేజీలో వెనుకబడ్డాయి. జనరల్, ఒకేషనల్ కలుపుకొని ఫలితాలను పరిశీలిస్తే.. హయత్‌నగర్ జూనియర్ కాలేజీలో 18.91 శాతం, సరూర్‌నగర్ కాలేజీలో 31.82 శాతం, ఇబ్రహీంపట్నం కాలేజీలో 24.68 శాతం, ఆమనగల్లు కాలేజీలో 37.04 శాతం, షాద్‌నగర్ జూనియర్ కాలేజీలో 46.32 శాతం, కందుకూరు కాలేజీలో 39.13 శాతం, యాచారం జూనియర్ కాలేజీలో 29.09 శాతం, రాయదుర్గంలో 24.94 శాతం, రామచంద్రపుర కాలేజీలో 32.27 శాతం, రాజేంద్రనగర్ జూనియర్ కాలేజీలో 39.08 శాతం, మహేశ్వరం కాలేజీలో 25.68 శాతం, శంషాబాద్ జూనియర్ కాలేజీలో 38.46 శాతం, చేవెళ్ల జూనియర్ కాలేజీలో 41.12 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

సెకండియర్‌లో కొంత మెరుగు!

ఫస్టియర్ ఫలితాలు ఆధ్వానంగా ఉన్నాయి. కానీ, ఇంటర్ సెకండియర్ ఫలితాలు కొంతలో కొంత మెరుగ్గా ఉన్నాయి. ఎనిమిది కాలేజీల్లో విద్యార్థులు 50 శాతం కంటే ఎక్కువ ఫలితాలు సాధించారు. చేవెళ్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 60.57 శాతం, కందుకూరు జూనియర్ కాలేజీలో 65.06 శాతం, కేశంపేట జూనియర్ కాలేజీలో 68.18 శాతం, షాద్‌నగర్ జూనియర్ కాలేజీలో 66.09, ఫరూక్‌నగర్ జూనియర్ కాలేజీలో 65.79 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అలాగే ఆమనగల్లు జూనియర్ కాలేజీలో 76.06 శాతం, మాడ్గులలో 84.4, మంచాలలో 72.48 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ఇదిలా ఉండగా, ఇంటర్ సెకండియర్‌లో కొన్ని కాలేజీల్లో ఉత్తీర్ణత శాతం ఘోరంగా పడిపోయింది. జనరల్ విద్యార్థులతో పాటు ఒకేషనల్ కోర్సు కలుపుకొని ఉత్తీర్ణతను పరిశీలిస్తే.. శంషాబాద్ జూనియర్ కాలేజీలో 39.71 శాతం నమోదైంది, అలాగే మహేశ్వరం జూనియర్ కాలేజీలో ఉత్తీర్ణత దారుణంగా పడిపోయింది. కేవలం 18.91 శాతం నమోదైంది. రాజేంద్రగన్ కాలేజీలో 32.34 శాతం, రామచంద్రపురంలో 38.56, రాయదుర్గంలో 39.28, యాచారంలో 44.44, ఇబ్రహీంపట్నంలో 41.55, సరూర్‌నగర్‌లో 36.46, హయత్‌నగర్‌లో 32.56 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

మెరిసిన మోడల్ స్కూల్ విద్యార్థులు

మోడల్ స్కూల్ విద్యార్థులు ఇంటర్ ఫస్టియర్, సెకండియర్‌లో ప్రైవేట్ కాలేజీలకు దీటుగా మంచి ఫలితాలు సాధించారు. జిల్లాలో 9 తెలంగాణ మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఇంటర్ ఫస్టియర్‌కు సబంధించి చేవెళ్లలోని మోడల్ స్కూల్‌లో 73 శాతం, పాల్మాకులలో 50 శాతం, టీఎస్ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో 69 శాతం, గున్‌గల్‌లో 55.32 వాతం, ఆరుట్లలో 51 శాతం, నేదునూరులో 51 శాతం, శంకర్‌పల్లిలో 41 శాతం, మహేశ్వరంలో 60.7 శాతం, ఇబ్రహీంపట్నంలో 36.61 శాతం నమోదైంది.

సత్తా చాటిన కేజీబీవీ విద్యార్థులు

ఇంటర్, ఫస్టియర్, సెకండియర్ ఫలితాల్లో కస్తూర్బా విద్యార్థినులు సత్తా చాటారు. జిల్లాలో 20 కేజీబీవీలు ఉండగా.. పదింటిలో ఇంటర్ స్థాయి విద్యను అందిస్తున్నారు. ఫరూక్‌నగర్ కేజీబీవీలో ఎంపీసీ, బైపీసీ ఫస్టియర్‌లో 83.01 ఉత్తీర్ణత సాధించారు. ఇబ్రహీంపట్నంలోని కేజీబీవీలో ఎంపీసీ, బైపీసీలో 80.30 శాతం, శంషాబాద్‌లోని కేజీబీవీ ఎంపీసీ, బైపీసీలో 54 శాతం, కొందుర్గు కేజీబీవీ సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యు కోర్సుల్లో 86.50 శాతం, శంకర్‌పల్లిలోని కేజీబీవీ సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యులో 75 శాతం, మహేశ్వరంలోని కేజీబీవీ సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యు కోర్సులో 74 శాతం, కందుకూరులోని కేజీబీవీలో సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యువో కోర్సులో 69 శాతం, కొత్తూరు కేజీబీవీలో 65, మంచాలలో77, షాబాద్‌లో 86, కేశంపేటలో 89.74 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

మంచాల కేజీబీవీలో 100 శాతం ఉత్తీర్ణత

ఇంటర్ సెకండియర్‌లో మంచాల కేజీబీవీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ కాలేజీలో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. దాంతో తోటి కేజీబీలకు ఆదర్శంగా నిలిచింది. సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యు గ్రూప్‌లో 26 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 26 పాస్ అయ్యారు. దీని తర్వాత స్థానంలో కేశంపేట కేజీబీవి నిలిచింది. 77 మంది విద్యార్థులకు 73 మంది పాసయ్యారు. 94.81 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కొందుర్గులో 47 మంది విద్యార్థినులకు 43 మంది పాస్ అయ్యారు. 91 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఫరూక్‌నగర్‌లోని కేజీబీవీలో ఎంపీసీ, బైపీసీ విభాగంలో 53 మంది విద్యార్థినులకు 48 మంది పాసయ్యారు. 90 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇబ్రహీంపట్నంలో 68 శాతం, శంషాబాద్‌లో 82, శంకర్‌పల్లిలో 73, మహేశ్వరంలో 81, కందుకూరులో 86 శాతం, కొత్తూరులో 73 శాతం ఉత్తీర్ణత సాధించారు.

టాప్‌లో నిలిచిన శంషాబాద్ మోడల్ కాలేజీ

ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో 802 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 565 మంది పాసయ్యారు. 70.45 శాతం ఉత్తీర్ణత నమోదై శంషాబాద్ మోడల్ స్కూల్ జిల్లాలో టాప్‌లో నిలిచింది. 86 మంది విద్యార్థులకు 75 మంది పాసయ్యారు. 87.21 శాతం ఉత్తీర్ణత నమోదైంది. చేవెళ్లలో 83.81, పాల్మాకులలో 75 శాతం, గున్‌గల్‌లో 53.85, నేదునూరులో 66.67, శంకర్‌పల్లిలో 54.39, మహేశ్వరంలో 65.42, ఆరుట్లలో 77.94 శాతం, ఇబ్రహీంపట్నంలో 54.43 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

- మల్కాజిగిరికి చివరి రోజు 61మంది 91 సెట్లు
- మొత్తం 114 మంది 177 సెట్లు దాఖలు
- చేవెళ్లకు చివరి రోజు 31 నామినేషన్లు
- ఇప్పటి వరకూ మొత్తం 66 మంది 87 దాఖలు

ఆంధ్రజ్యోతి, మేడ్చల్/రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 25: మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి చివరిరోజు జోరుగా నామినేషన్‌లు దాఖలయ్యాయి. ఈమేరకు గురువారం 61 మంది 91 సెట్లు దాఖలు చేసినట్లు మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించిన నామినేషన్ల స్వీకరణలో భాగంగా మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి మొత్తం 114 మంది అభ్యర్థులకు గాను, 177 సెట్లు దాఖలు చేసినట్లు తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ స్థానానికి అన్ని పార్టీలకు చెందిన అభ్యర్థులతో పాటు స్వతంత్రులు కూడా పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తం 66 మంది అభ్యర్థులు 87 సెట్లు దాఖలు చేశారు. అనుచరులతో కలిసి ర్యాలీగా తరలివెళ్లి నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి తన నామినేషన్‌ను ఎన్నికల అధికారి శశాంకకు అందజేశారు. అలాగే స్వతంత్ర అభ్యర్థిగా ఈసరి సూర్యప్రకాశ్‌రెడ్డి, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా కె.విశ్వేశ్వర్‌రెడ్డి, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా గోపిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బానోత్ వెంకన్న, స్వతంత్ర అభ్యర్థిగా నీరటి ఆంజనేయులు, ప్రజావెలుగు పార్టీ అభ్యర్థిగా టి. దుర్గప్రసాద్, స్వతంత్ర అభ్యర్థిగా మహ్మద్ రియాజుర్ రెహ్మాన్‌షేక్, స్వతంత్ర అభ్యర్థిగా ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ అభ్యర్థి తరఫున కాసాని వీరేష్, ఇండియా ప్రజా బంధు పార్టీ అభ్యర్థిగా పాలమాకుల మధు, స్వతంత్ర అభ్యర్థిగా రాచమల్ల రాజేష్, తెలంగాణ రిపబ్లిక్ పార్టీ అభ్యర్థిగా నర్సింహారెడ్డి ద్యాపా, అన్న వైఎస్సార్ పార్టీ అభ్యర్థిగా ఇబ్రహీం ఉల్‌హక్, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా తోట్ల రాఘవేందర్, స్వతంత్ర అభ్యర్థులుగా జి. మల్లేష్‌గౌడ్, కావలి సుకుమార్, దూదేకుల ఇమామ్ హుస్సేన్, జలీల్ అహ్మద్, కొంపల్లి అనంత రెడ్డి, ఎస్కే. సమీర్, శ్రీనివాస్‌రావ్ జాదవ్, సయ్యద్ ఇబ్రహీం, కాత్రవత్ శివాణి కాత్రవత్ శ్రావణి, నామినేషన్ వేశారు. అలాగే రాష్ట్రీయ సామాన్య ప్రజాపార్టీ అభ్యర్థిగా వసంత్ కుమార్, బ్లూ ఇండియా పార్టీ అభ్యర్థిగా చింతలగారి వెంకటస్వామి, రెవెల్యూషన్ సొసైటీ పార్టీ అభ్యర్థిగా గాదె రంజిత్‌రెడ్డి, జనతా దళ్ (సెక్యులర్) పార్టీ అభ్యర్థిగా బొమినెల్లి ప్రభాకర్, యుగ తులసి పార్టీ అభ్యర్థిగా బింగి రాములు నామినేషన్ దాఖలు చేశారు. ఇక నేటి నుంచి నామినేషన్ పరిశీలన జరగనుంది. ఈనెల 29 వరకు నామినేషన్ల విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంది.



మలేరియాను నిర్మూలిద్దాం

డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

షాద్‌నగర్, ఏప్రిల్ 25 : మలేరియాను పూర్తిగా నిర్మూలిద్దామని, అందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.వెంకటేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా నిర్మూలన దినం సందర్భంగా గురువారం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రి నుంచి పట్టణ ప్రధాన కూడలి వరకు నిర్వహించిన ర్యాలీని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రాకేష్‌తో కలిసి వెంకటేశ్వర్‌రావు ప్రారంభించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వైద్య సిబ్బందితో ఆయన మాట్లాడారు. మలేరియా వ్యాధికి ప్రధాన కారణమైన దోమలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని, వ్యాధికి సోకిన వారికి నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో దోమల సంచారం ఎక్కువగా ఉంటుందని, వాటిని పూర్తిగా నివారించేందుకు వైద్యసిబ్బంది దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఇతర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు

వీరశైవ సమాజం తాలూకా కమిటీ ఎన్నిక

కొడంగల్ రూరల్, ఏప్రిల్ 25: వీరశైవ సమాజం కొడంగల్ తాలూకా కమిటీని గురువారంనిరంజన మఠంలో ఎన్నుకున్నారు. మఠాధిపతి శాశ్వత గౌరవ అధ్యక్షుడు శ్రీ జగద్గురు సిద్ధిలింగ మహాస్వామి, గౌరవ అధ్యక్షుడు ముద్దప్పదేశ్‌ముఖ్ సమక్షంలో అధ్యక్షుడిగా కొవ్వూర్ విజయ్‌వర్ధన్, ఉపాధ్యక్షుడిగా బర్ల శ్రీశైలం, సోమయ్య, కుమారస్వామి, ప్రధాన కార్యదర్శిగా దౌల్తాబాద్ మల్లేశం, కోశాధికారిగా రాకేశ్, కార్యదర్శులుగా వద్ది శరణయ్య, జాజిం భరత్‌కుమార్, పి.శివశంకర్, ఆవుటి సిద్దప్ప, న్యాయ సలహాదారుడిగా జాదవరావు, గౌరవ సలహాదారులుగా మల్లికార్జున్, ఆవుటి మల్లేశ్, ఆర్.బస్వరాజ్, సిద్దిలింగప్పలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి


ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్

కులకచర్ల, ఏప్రిల్ 25: ధాన్యం కొనుగోళ్లను ప్రక్రియను వేగవంతం చేయాలని వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ తెలిపారు. కులకచర్లలో కొనసాగుతున్న ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. సరైన తేమ శాతం ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని, తాలు లేకుండా శుభ్రం చేసిన వరి ధాన్యాన్ని చూసి కొనుగోలు చేయాలన్నారు. వ్యవసాయ అధికారులు ధృవీకరించిన ధాన్యాన్ని వెంటనే తూకం వేయించి మిల్లులకు తరలించాలని నిర్వాహకులను సూచించారు. వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి డబ్బులు జమ అయ్యేలా చూడాలన్నారు. అనంతరం కులకచర్లలో పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో వీరస్వామి, కేంద్రం ఇంచార్జ్ వెంకట్, రైతులు పాల్గొన్నారు.

డిప్లమా కోర్సుల్లో అనాథ పిల్లలకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, ఏప్రిల్ 25: 2024-25 సంవత్సరానికి దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళ టెక్నికల్ సంస్థ హైదరాబాద్ నందు 3 సంవత్సరాల టెక్నికల్ డిప్లమా కోర్సులకు అనాథ పిల్లలు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా జిల్లా సంక్షేమ అధికారి జ్యోతి పద్మ ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. తల్లిదండ్రులు కోల్పోయిన అనాథ బాలికలు, తల్లిని లేదా తండ్రిని కోల్పోయిన బాలికల నుంచి, అక్రమ రవాణాకు సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ ఉంటుందన్నారు. ప్రతీ కోర్సులో 60సీట్లకు గానూ మొత్తం 240సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంపికైన బాలికలకు ఉచిత విద్యతో పాటు వసతి సౌకర్యం కల్పించబడుతుందని తెలిపారు. వివరాలకు 9640863896, 9849672296 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు భద్రేశ్వరుడి జాతర సన్నాహక సమావేశం

తాండూరు, ఏప్రిల్ 25: ఈనెల 30 నుంచి ప్రారంభమయ్యే శ్రీభావిగి భద్రేశ్వర స్వామి జాతర ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లపై ఈనెల శుక్రవారం(నేడు) 11గంటలకు సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్డీవో శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి సుదర్శన్

ఎక్కడైనా బాధ్యతాయుతంగా పనిచేస్తా

వికారాబాద్, ఏప్రిల్ 25: తాను ఎక్కడ పనిచేసినా బాధ్యతాయుతంగా పనిచేస్తానని జిల్లా ప్రధాన న్యాయాధికారి కె.సుదర్శన్ తెలిపారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు నిజాయితీగా నిష్పక్షపాతంగా పనిచేయడం ఇష్టమన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ మాట్లాడుతూ.. జిల్లా న్యాయమూర్తిగా మంచి సేవలందించారని అన్నారు. న్యాయవాదులను చిన్నాపెద్దా తేడా లేకుండా చూసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, సీనియర్ న్యాయ మూర్తి డీబీ శీతల్, ప్రిన్సిపల్ జూనియర్ న్యాయమూర్తి శ్రీకాంత్, అదనపు జూనియర్ న్యాయమూర్తి శృతిదూత, ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్, న్యాయవాదులు సంపూర్ణ ఆనంద్, గోవర్ధన్‌రెడ్డి, యాదవరెడ్డి, కమాల్‌రెడ్డి, బస్వరాజ్, మహమ్మద్ రఫీ, శ్రీనివాస్‌రావు, శుక్లావర్ధన్‌రెడ్డి, నాగరాజు, శంకరయ్య, నారాయణ, బాలయ్య, అనిల్ కుమార్, వెంకటేశ్, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలి

» జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

వికారాబాద్, ఏప్రిల్ 25: దేవాదాయశాఖ భూములను అన్యాక్రాంతం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో గురువారం ల్యాండ్ రెవెన్యూ కమిషనర్ ఆదేశాల మేరకు దేవదాయ శాఖ భూముల అన్యాక్రాంతంపై రెవెన్యూ, దేవాదాయ శాఖ అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ.. దేవాదాయ శాఖకు సంబంధించి సర్వే నెంబర్ల వారీగా భూముల వివరాలను అందించాలన్నారు. ధరణి పోర్టల్‌లో గల వివరాలతో సరి చూడాలని రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. దేవాదాయ శాఖ భూములు అన్యాకాంతం కాకుండా రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసే భూములను పరిరక్షించాలన్నారు. ఈ సమీక్షలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శేఖర్, ఇన్‌స్పెక్టర్ మధుబాబు, తాండూర్, వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం డీఏవో మునీరుద్దీన్, గోవిందమ్మ, ఎం-సెక్షన్ సూపరింటెండెంట్ శివ శ్రీనివాస్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న రజిన్ చోప్రా

అక్రమ డబ్బు రవాణాకు అడ్డుకట్ట వేయాలి

యాలాల, ఏప్రిల్ 25: ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా డబ్బు రవాణా జర గకుండా అడ్డుకట్ట వేయాలని రాష్ట్ర ఎన్నికల వ్యయం (ఖర్చుల) అధికారి రజిన్ చోప్రా అన్నారు. ఆయన గురువారం ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్‌ను సందర్శించారు. అనంతరం రజిన్ చోప్రా మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల సందర్భంగా డబ్బులు రవాణా చేసే అవకాశం ఉందన్నారు. అలా జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూరు ఆర్డీవో శ్రీనివాసరావు, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, తహసీల్దార్లు మునీరొద్దీన్, తారాసింగ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా నాభిశిల ప్రతిష్ఠాపనోత్సవాలు

షాబాద్, ఏప్రిల్ 25 : మండల పరిధిలోని దామర్లపల్లి గ్రామంలో గురువారం ఘనంగా నాభిశిల ప్రతిష్ఠాపనోత్సవాలు జరిగాయి. ఉత్సవాల రెండోరోజు శ్రీ గణపతి, ఆవాహిత దేవి దేవతాపూజ, మహాస్నపనవిధి, మంటప ఆహాహిత దేవాత హోమాలు, మన్యుసూక్తసహిత రుద్రహోమం, మహాస్నపనవిధి ధాన్యాధివాసాంగ ఫలపుష్పాదివాస శయ్యాదివాసం మహోత్సవాలు తదితర కార్యక్రమాలను మంత్రోచ్చరణల మధ్య వేదపండితులు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బోకుల లింగం, గ్రామస్థులు దయాకర్‌చారి, పెంటారెడ్డి, బాలకృష్ణారెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మచ్చలేని మనిషి కొండాను గెలిపించాలి

» బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వివేకానందరెడ్డి

ధారూరు, ఏప్రిల్ 25: రాజకీయ జీవితంలో మచ్చలేని మనిషిగా పేరున్న బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వ ర్‌రెడ్డిని గెలిపించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వివేకానందరెడ్డి గురువారం ఒక ప్రకటనలో ఓటర్లను కోరారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందని తెలిపారు. గ్రామాల్లో మరుగుదొడ్లు, ఉచిత రేషన్ బియ్యం, సిమెంట్ రోడ్లు, ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరు తదితర పథకాలు పేదలకు అందించామని చెప్పారు. హామీలు నెరవేర్చే సత్తా కాంగ్రెస్ పార్టీకి లేదని, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని ఆపార్టీ క్యాడరే ఇష్టపడటం లేదన్నారు. అలాంటి వారికి టికెట్ ఇచ్చారని ఆయన విమర్శించారు. ఈ ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే బీజేపీకి ఓటు వేసి విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.రమేశ్, పాండుగౌడ్, రాజేందర్ గౌడ్, రాజు నాయక్, కృష్ణ, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి

యాలాల: మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి చెందుతోందని ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అన్నారు. చెన్నారం, దౌలాపూర్ గ్రామాల్లో గురువారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాలాల మండల అధ్యక్షుడు యాదగిరి, మాజీ సర్పంచ్ శివకుమార్, సుదర్శన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కాశీనాథ్ పాల్గొన్నారు.



రాజీవ్ గృహకల్పలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ప్రజలు బీజేపీ బ్రహ్మరథం పడుతున్నారు

వికారాబాద్: ప్రజల్లోకి వెళితే ప్రజలు బీజేపీకి బ్రహ్మరథం పడుతున్నారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, జిల్లా నాయకుడు రాజేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని రాజీవ్‌గృహకల్పలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలుకూరులో బీజేపీ నాయకుల ప్రచారం

మొయినాబాద్, ఏప్రిల్ 25 : చిలుకూరులో గురువారం బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేర్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మోదీ చేపట్టిన కార్యక్రమాలు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తూ ఓట్లు అడిగారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మోర నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలి: నర్సింహారెడ్డి

కందుకూరు : కేంద్రంలో బీజేపీకి మరోసారి అవకాశం ఇవ్వాలని, చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి కోరారు. గురువారం ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ మంద జ్యోతితో కలిసి మండలంలోని దెబ్బడగూడ గ్రామంలో ఉపాధి పనుల వద్ద ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం మరింత పురోగతి చెందడానికి ప్రధాని నరేంద్రమోదీ పెద్దపీట వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల శాఖ ప్రధాన కార్యదర్శి నిమ్మ అంజిరెడ్డి, జిల్లా నాయకులు బొక్క సత్యనారాయణరెడ్డి, మంద పాండు తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరంలో..

మహేశ్వరం : ప్రధాని నరేంద్రమోదీ ప్రతిష్టాత్మకంగా అమలు పరిచిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించడంలో కార్యకర్తలు చురుకైన పాత్ర పోషించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని నాగారంలో పార్టీ మండలాధ్యక్షుడు ఎస్. మాధవాచారి అధ్యక్షతన బీజేపీ మండల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ అనేక అభివృద్ధి పనులను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుంటే వాటన్నింటిని తామే చేస్తున్నామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూ వచ్చిందన్నారు. అదే తరహాలోనే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనలు చేస్తున్నదన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌శర్మ, పాపయ్యగౌడ్, అందెల శ్రీరాములుయాదవ్, మిద్దెను దర్శన్‌రెడ్డి, కె. జంగయ్యయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యం

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 25 : లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్లలో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు గున్నాల గోపాల్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఓబీసీ కన్వీనర్ ఎల్లని వెంకటేష్‌గౌడ్, బీజేపీ మండలాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డిలు కోరారు. చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా గురువారం మండల పరిధిలోని మోత్కుపల్లి, చందానగర్, వీరన్నపేట, చిలుకూరు గ్రామాల్లో పర్యటించి ఇంటింటికి తిరిగి బీజేపీకి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఎన్నో ఏళ్లు కాంగ్రెస్ పార్టీ దేశాన్ని పాలించిందని కానీ చేసిందేమి లేదని అదే మోదీ ప్రభుత్వం 10 సంవత్సరాల్లో ఎంతో అభివృద్ధి చేసిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సహదేవ్ గౌడ్, ఓబీసీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టు రాజమల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

» మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

» బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన నేతలు

చేవెళ్ల, ఏప్రిల్ 25 : పార్లమెంట్‌లో చేవెళ్ల ప్రజల గొంతు వినిపించాలంటే అన్ని వర్గాల ఓటర్లు బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి కోరారు. గురువారం రాత్రి చేవెళ్ల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని బీఆర్ఎస్ అభ్యర్థి జ్ఞానేశ్వర్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యలతో కలిసి ఆమె పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు గుర్తు చేసి బీఆర్ఎస్‌కు ఓట్లు వేసేవిధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలోని మంత్రులందరు అహంకర ధోరణిలో మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఓడించాలన్నారు.



చేవెళ్లలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సబితారెడ్డి, కాసాని జ్ఞానేశ్వర్

అంతకు ముందు కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ జెండాను ఎగరవేయాన్నారు. పార్లమెంట్‌లో చేవెళ్ల ప్రజల తరఫున గొంతును వినిపిస్తానన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల, పరిగి ఇన్‌చార్జీలు రాంబాబు, గట్టు రాంచందర్ రావు, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైఎస్ ఎంపీపీ శివప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్, జడ్పీటీసీ శ్రీకాంత్, మాజీ జెడ్పీటీసీ బాల్‌రాజ్, నాయకులు, కార్యర్తలు తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనే లక్ష్యం

» డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.ధరణికుమార్

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 25 : మలేరియా నివారణే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు తమ వంతుగా కృషి చేసినప్పుడే ఆ వ్యాధిని నిర్మూలించవచ్చని ఇబ్రహీంపట్నం డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.ధరణికుమార్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం ఇబ్రహీంపట్నంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగునీరు ఎక్కడా నిల్వకుండా అందరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే దోమలను నివారించవచ్చన్నారు. ప్రతీ శుక్రవారం డ్రై డేగా పాటించాలన్నారు. ర్యాలీలో డా.మమత, డా.శ్రీకీర్తన, సీహెచ్‌వో గోపాల్‌రెడ్డి, హేంలాల్, చంద్రశేఖర్, వయోలా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హస్తం.. పేదల నేస్తం..

» బీజేపీని గెలిపిస్తే కొరివితో తలగోక్కున్నట్టే

» కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 25 : కాంగ్రెస్ హస్తం.. పేదల నేస్తమని కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా గురువారం ఆయన రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ మతాల మధ్య చిచ్చుపెట్టి బీజేపీ చోద్యం చూస్తోందని గుర్తు చేశారు. ఆ పార్టీకి ఓటేస్తే కొరివితో తలగోక్కున్నట్టేనని చెప్పారు. ఇటీవల జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే రెండు, మూడు అమలవుతున్నాయని, కాంగ్రెస్ అధిష్ఠానం, సీఎం రేవంత్‌రెడ్డి, ఆరు గ్యారెంటీలను సంపూర్ణంగా అమలు చేసేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియగానే నూరు పాళ్లు అమలు చేసి చూపుతామని చెప్పారు. కేంద్రంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీజేపీ దేశానికి, తెలంగాణకు, ప్రత్యేకంగా చేవెళ్లకు చేసిందేమీ లేదన్నారు. కేంద్రం తెచ్చిన జీఎస్టీ, పెద్దనోట్ల రద్దు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపుతో సామాన్యుల జీవితాలు దుర్భరంగా మారాయని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పేదలు బతకలేని పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో నిరుద్యోగం విలయతాండవం చేస్తున్నదన్నారు. ఈ సమస్యలేవీ బీజేపీకి పట్టటం లేదని విమర్శించారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, విదేశాల్లోని నల్లధనాన్ని వెనక్కు రప్పించి ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామన్న ప్రధాని మోదీ తన హామీలను నిలబెట్టుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఏఏ, ఎన్ఆర్‌సీ లాంటి చట్టాలతో మైనారిటీలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డికి ఓటేస్తే నిండా మునుగుడేనని హెచ్చరించారు. చేవెళ్ల అభివృద్ధి కావాలన్నా, మత సామరస్యంతో ప్రజలు ఆనందంగా ఉండాలన్నా కాంగ్రెస్‌కే ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. చెయ్యి గుర్తుకు ఓటేసి చేవెళ్ల ఎంపీగా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి బీజేపీ, బీఆర్ఎస్‌ను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే... పేదలకు సరైన న్యాయం జరుగనున్నట్లు చెప్పారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే, శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌ఛార్జి జగదీశ్ గౌడ్, సీనియర్ నాయకులు ఫహీమ్ తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న చేవేళ్ల కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి

కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

షాబాద్ : చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా గడ్డం రంజిత్‌రెడ్డి నామినేషన్‌కు గురువారం పార్టీ షాబాద్ మండల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ హయాంలోనే దేశం ఎంతో అభివృద్ధి చెందిందని, తెలంగాణ నుంచి ఎంపీగా అధిక స్థానాలు గెలిపించుకుని రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు చంద్రయ్య, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

భీంభరత్ ఆధ్వర్యంలో..

చేవెళ్ల :రంజిత్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి చేవెళ్ల నుంచి ఆ పార్టీ నాయకులు గురువారం భారీగా తరలి వెళ్లారు. కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్ ఆధ్వర్యంలో చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్, నవాబ్‌పేట్ తదితర మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి భారీగా నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక వాహనాల్లో రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపించుకోవాలన్నారు.

రంజీత్‌రెడ్డి గెలుపునకు సమిష్టి కృషి

కందుకూరు, ఏప్రిల్ 25 : లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజీత్‌రెడ్డి గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలని జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి అన్నారు. గురువారం ఆ పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేస్తున్న రంజిత్‌రెడ్డికి మండలం నుంచి భారీ మెజార్టీ ఇవ్వాలని కోరారు. అనంతరం రంజీత్‌రెడ్డి నామినేషన్ కోసం రాజేంద్రనగర్‌కు తరలివెళ్లారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాణాప్రతాపరెడ్డి పాల్గొన్నారు

రంజీత్‌రెడ్డి నామినేషన్‌కు తరలిన నాయకులు

నవాబుపేట: చేవేళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజీత్‌రెడ్డి గురువారం నామినేషన్ వేయడంతో నవాబుపేట మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎత్రజ్‌పల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు తాండూరులో ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

తాండూరురూరల్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామాల్లో శుక్రవారం(నేడు) మల్కాపూర్, కరన్‌కోట్ గ్రామాల్లో ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పర్యటిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు(శుక్రవారం) ఉదయకం 10 గంటలకు మల్కాపూర్, సాయంత్రం 5.30గంటలకు కరన్‌కోట్ గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారని చెప్పారు.

పచ్చ చీర కట్టుకుని.. వైఎస్ శత్రువు ఇంటికి వెళ్లారు

» బురద చల్లేందుకు ఇద్దరు చెల్లెళ్లను

» ఎవరు పంపించారో మీకు తెలుసు

» వీళ్లా వైఎస్ఆర్ వారసులు?: జగన్

» షర్మిల, సునీతపై పరోక్ష విమర్శలు

» వైఎస్ అవినాశ్ చిన్నపిల్లాడని వ్యాఖ్య

కడప, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): "వైఎస్ ఎవరితో పోరాడారో, అలాంటి శత్రువుల ఇంటికి పసుపు చీర కట్టుకుని వెళ్లారు. వారి స్క్రిప్ట్‌లను మక్కీకి మక్కీ చదివి వినిపిస్తూ, వారి కుట్రలో భాగమవుతున్నారు. వీళ్లా వైఎస్సార్ వారసులు? వైఎస్ విగ్రహాలు గ్రామంలో ఉండకూడదని చెప్పిన వారితో చెట్టాపట్టాలేసుకున్నారు" అని ఏపీ సీఎం జగన్ తన చెల్లెళ్లు షర్మిల, సునీతను పరోక్షంగా విమర్శించారు. నామినేషన్ వేసేందుకు గురువారం తాడేపల్లి నుంచి పులివెందులకు చేరుకున్న ఆయన.. అక్కడ బహిరంగ సభలో మాట్లాడారు. "జగన్ అధికారంలోకి వచ్చాక మమ్మల్ని పక్కనబెట్టాడని మాట్లాడుతున్న నా బంధువులకు తెలియజేస్తున్నా"నంటూ షర్మిల, సునీత పేర్లను ప్రస్తావించకుండా నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. షర్మిల తన కుమారుడి పెళ్లి శుభలేఖ ఇవ్వడానికి చంద్రబాబు ఇంటికి వెళ్లిన సందర్భాన్ని ప్రజలకు గుర్తుచేశారు. 'అవినాశ్ ఏ తప్పూ చేయలేదని బలంగా నమ్మాను కాబట్టే అతడికి టికెట్ ఇచ్చాను. మా అందరి కన్నా చిన్నపిల్లాడు అవినాశ్. ఆ పిల్లాడి జీవితం నాశనం చేయాలని పెద్దపెద్దవాళ్లంతా కుట్రలు చేస్తున్నారు. వివేకా హత్య కేసు విషయంలో అవినాశ్ అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పలేని వీరంతా ఈ చిన్నపిల్లాడిని దూషించడం, తెరమరుగు చేయాలనుకోవడం దారుణం. అసలు వీరందరూ మనుషులేనా?" అన్నారు. "బురద చల్లేందుకు ఇద్దరు చెల్లెమ్మలను ఎవరు పంపించారో, వారి వెనకాల ఎవరున్నారో మీకు తెలుసు" అని ప్రజలనుద్దేశించి అన్నారు.

సభ్యత, సంస్కారం ఉన్నాయా?

» నేను కట్టుకున్న చీర గురించి మగవాళ్ల ముందు మాట్లాడతావా?

» జగన్‌పై షర్మిలారెడ్డి ఫైర్



గుంటూరు/విజయవాడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): 'సీఎం స్థాయిలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి బహిరంగ సభ పెట్టి.. వేల మంది మగవాళ్ల ఉంటే.. నేను కట్టుకున్న చీర గురించి మాట్లాడాడు' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ధ్వజమెత్తారు. మాట్లాడుతున్నది సొంత చెల్లెలి గురించి అన్న ఇంగితం కూడా లేకుండా తన వంటిపై ఉన్న బట్టల గురించి ప్రస్తావించారంటే ఎంత దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారో ఆలోచించాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం గుంటూరు, విజయవాడల్లో జరిగిన ప్రచార సభల్లో ఆమె ప్రసంగించారు. పులివెందులలో తనపై జగన్ చేసిన వ్యాఖ్యలకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'నేను పసుపు చీర కట్టుకొన్నానని అవహేళనగా మాట్లాడారు. ఏం.. పసుపు చీర కట్టుకోకూడదా? చంద్రబాబు ఏమైనా పసుపు రంగు కొన్నారా? జగన్ ఒక విషయాన్ని మరిచిపోయినట్లున్నారు. జగన్ పత్రికలో పసుపు రంగు ఉంటుంది. దానికి వైఎస్ ఆనాడు చెప్పిన మాట.. పసుపు అంటే మంగళకరమైన రంగు. అది టీడీపీది కాదని పెట్టించారు' అని తెలిపారు. సొంత చెల్లి చీర గురించి మాట్లాడుతున్న వీరికి సభ్యత, సంస్కారం ఉన్నాయా అని విరుచుకుపడ్డారు. ఇంకా ఆమె ఏమన్నారంటే..

దేవుడు మీకు ఇంగితం ఇవ్వలేదా?

సీఎం జగన్ ఈ రోజున పులివెందుల సభలో వివేకానందరెడ్డి ప్రస్తావన చేశారు. ఆయన గురించి ఒక్క మంచి మాట కూడా నోటి వెంట రాలేదు. వివేకానందరెడ్డికి రెండో పెళ్లి అయిందట. ఇంకో సంతానం ఉందట! అంతేతప్ప.. వివేకానందరెడ్డి ఒక ప్రజానాయకుడని గానీ.. ఎవరైనా సమస్యతో వస్తే ఉత్త చేతులతో పంపడని గానీ.. రాజశేఖర్‌రెడ్డి తమ్ముడని గానీ... ఆఖరి నిమిషం వరకు వైసీపీ కోసమే పని చేశారని గానీ ఒక్క మాటయినా జగన్ నోట్లో నుంచి రాలేదంటే ఎంత ఆశ్చర్యం! అవినాశ్‌రెడ్డి అమాయకుడు, చిన్నవాడంట! ఆయన భవిష్యత్‌ను మేం నాశనం చేస్తున్నామని జగన్ మాట్లాడుతున్నారు. అతడి భవిష్యత్‌ను పాడు చేసేవాళ్లమే అయితే మీరు ఎంపీగా నిలబెట్టినప్పుడు.. వివేకా వద్దు వద్దని చెప్పినా మేమెవరం కాదనలేదే! వివేకాను చంపిన రోజునే అవినాశ్ చంపాడని చెప్పలేదే! అవినాశ్ మంచివాడని నమ్ముతున్నాను.. అందుకే ఎంపీ టికెట్ ఇచ్చానని జగన్ అంటున్నారు. ఎందుకు గుడ్డిగా నమ్ముతున్నారు? మీకు దేవుడు ఇంగితం ఇవ్వలేదా? మీకు ఆలోచించే శక్తి లేదా? సీబీఐ అన్ని ఆధారాలు చూపిస్తోంది కదా! చంపించిన వారు, చంపినవారి గూగుల్ టేక్ అవుట్స్ మ్యాచ్ అవుతున్నాయి. లావాదేవీలు జరిగాయి. అడ్వాన్స్‌లు తీసుకున్నారని సీబీఐ చెబుతున్నా ఎందుకు అవినాశ్‌ను ఇంకా నమ్ముతున్నారు? అన్నీ తెలిసి కూడా కాపాడుతున్నారంటే మీకు ఏమి అవసరం ఉందో చెప్పాలి. అవినాశ్‌ను నిందితుడిగా సీబీఐ చేర్చినా ఎందుకు కాపాడారు.. మళ్లీ ఎందుకు టికెట్ ఇచ్చారో చెప్పాలి.

వివేకా హత్యపై లైవ్ డిబేట్‌కు సిద్ధం

» మీ చానల్‌కే వస్తా.. మీరు సిద్ధమా?

» సీఎం జగన్‌కు డాక్టర్ సునీత సవాల్

» గాయానికి బ్యాండ్ తీయాలని సలహా

» లేకుంటే చీము పడుతుందని హెచ్చరిక

పులివెందుల రూరల్, ఏప్రిల్ 25: "వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు అవినాశ్‌రెడ్డి నిర్దోషి అని మీరు అంటున్నారు. ఇక ఏ వ్యవస్థపై మీకు నమ్మకముంది సార్?" అని ఏపీ సీఎం జగన్‌ను ఆయన చెల్లెలు, వివేకా కుమార్తె డాక్టరు సునీత సూటిగా ప్రశ్నించారు. పులివెందుల సభలో అవినాశ్‌రెడ్డిని జగన్ చిన్నపిల్లాడుగా సంబోధించడంపై సునీత స్పందించారు. చిన్నపిల్లాడైతే స్కూలుకు పంపించాలన్నారు. పులివెందులలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. "ఎంపీ అంటే బాధ్యత.. పిల్లలకు టికెట్లు ఇవ్వరు. నిందితులను మూడోసారి ఎంపీగా పోటీ చేయిస్తున్నారు. సీబీఐ నిందితులుగా తేల్చిన వారిని మీరు ప్రోత్సహిస్తున్నారు. దయచేసి ఇలా చేయకండి" అని కోరారు. "మీకోసం వివేకా ఎన్నో త్యాగాలు చేశారు. కానీ మీరేం చేశారు? ఆయన గురించి మంచిగా ఒక్కమాట కూడా మాట్లాడరు. ఆయన హత్యపై మీ చానల్‌లో లైవ్ డిబేట్ ఏర్పాటు చేయండి. నేను సిద్ధం. మీరు సిద్ధమా..?" అని జగన్‌కు సవాల్ విసిరారు. అలాగే.. గులకరాయి ఘటన జరిగినప్పటి నుంచీ తలకు బ్యాండేజ్ వేసుకుని తిరుగుతున్న జగన్‌కు ఆమె డాక్టర్‌గా ఓ సలహా ఇచ్చారు. దెబ్బతగిలిన చోట బ్యాండ్ ఎయిడ్ పెట్టుకుంటే లోపల చీము పట్టి, సెప్టిక్ అయ్యే చాన్స్ ఉందని హెచ్చరించారు. బ్యాండ్ ఎయిడ్ తీసేస్తే గాయం త్వరగా మానిపోతుందని తెలిపారు.

జగన్.. నీకిది తగునా?

» నీ సొంత మీడియాలోనే మీ చిన్నాన్న వ్యక్తిత్వ హననమా?

» సీఎం జగన్‌కు వివేకా సతీమణి సౌభాగ్యమ్మ లేఖ



పులివెందుల, ఏప్రిల్ 25: "నిన్ను సీఎంగా చూడాలని తపించిన మీ చిన్నాన్న వ్యక్తిత్వాన్ని మీ పత్రికల్లో, టీవీల్లో, సోషల్ మీడియాలో హననం చేయడం తగునా? న్యాయం కోసం పోరాడుతున్న నీ చెల్లి సునీత.. ఆమెకు మద్దతు ఇస్తున్న షర్మిలపై నిందలు మోపుతుంటే.. కుటుంబ సభ్యునిగా కాకపోయినా.. ముఖ్యమంత్రిగా అయినా ఇదేనా నీ కర్తవ్యం?" అని సీఎం జగన్‌ను వివేకా భార్య వైఎస్ సౌభాగ్యమ్మ ప్రశ్నించారు. ఈ మేరకు ఆమె సీఎంకు రాసిన బహిరంగ లేఖను గురువారం సోషల్ మీడియాలో పోస్టు చేశారు. "2009లో తండ్రి చనిపోయినపుడు నువ్వు ఎంత వేదనను అనుభవించావో 2019లో నీ చెల్లి సునీత కూడా అంతే వేదన అనుభవించింది. అప్పటినుంచి జరిగిన పరిణామాల్లో మమ్మల్ని ఎక్కువ బాధించిన విషయం.. మన కుటుంబంలోని వారే ఈ హత్యకు కారకులు కావడం... వాళ్లకు నువ్వు రక్షణగా ఉండటం. నిన్ను సీఎంగా చూడాలని తపించిన చిన్నాన్నపై మీ సొంత మీడియా, పార్టీ వర్గాలు తీవ్ర విమర్శలు చేశాయి. మాటల్లో చెప్పలేనంత విధంగా వ్యక్తిత్వ హననం చేయడం, చేయించడం నీకు తగునా? న్యాయం కోసం పోరాటం చేస్తున్న నీ చెల్లెలు సునీతను హేళన చేస్తూ, నిందలు మోపుతూ, దాడులకు కూడా తెగబడే స్థాయికి కొంత మంది దిగజారుతుంటే నీకు ఏమాత్రం పట్టడం లేదా? సునీతకు మద్దతుగా నిలిచి పోరాడుతున్న షర్మిలను కూడా టార్గెట్ చేస్తుంటే నువ్వు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం ఏమిటి? కుటుంబ సభ్యునిగా కాకపోయినా రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఇదేనా నీ కర్తవ్యం? ఇంకా బాధించే విషయం.. హత్యకు కారకులైన వారికి మళ్లీ పోటీ చేసే అవకాశాన్ని నువ్వు కల్పించడం. ఇది సముచితమా? ఇటువంటి చర్యలు నీకు ఏమాత్రం మంచిది కాదు. హత్యకు కారకుడైన నిందితుడు నామినేషన్ దాఖలు చేశాడు. చివరి ప్రయత్నంగా న్యాయం, ధర్మం గురించి ఆలోచించమని నిన్ను అర్థిస్తున్నా. రాగద్వేషాలకు అతీతంగా పరిపాలన చేస్తానని ప్రమాణం చేసిన ముఖ్యమంత్రిగా న్యాయం, ధర్మం, నిజంవైపు నిలబడమని వేడుకుంటున్నా" అని సౌభాగ్యమ్మ తన లేఖలో పేర్కొన్నారు.

పిల్లలను 'అంగన్‌వాడీ'లకు పంపాలి

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివరాణి



చిన్నారులతో సూపర్‌వైజర్ శివరాణి

కొందుర్గు, ఏప్రిల్ 25 : మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను తప్పని సరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివరాణి కోరారు. గురువారం మండల పరిధిలోని చిన్నఎల్కిచర్ల, అయోధ్యాపూర్ తండాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివరాణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శేఖరమ్మ, మంజుల, కవిత, అంజలి, సూజాత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్‌డే

చౌదరిగూడ : మండల పరిధిలోని పెద్ద ఎల్కిచర్లలో ఐసీడీఎస్ కేంద్రంలో గురువారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం లభిస్తుందని, వారు శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందుతారని చెప్పారు.

నీటి సమస్య రాకుండా చూడాలి



నందిగామ : మాట్లాడుతున్న ఎంపీపీ

నందిగామ, ఏప్రిల్ 25 : వేసవిలో నీటి సమస్య రాకుండా చూడాలని, సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని ఎంపీపీ ప్రియాంక శివశంకర్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆమె అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీడీవో సుమతి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ కళమ్మ, కోఆప్షన్ మెంబర్ బేగ్ అధికారులు, జీపీ ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

మహేశ్వరం : మండలంలోని అన్ని గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని బీజేపీ ఎంపీటీసీలు మండల సర్వసభ్యసమావేశంలో అధికారులను చెప్పారు. గురువారం ఎంపీపీ ఆర్. సునీతఅంద్యానాయక్ అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వాటన్నింటిని పరిష్కరించడంలో ప్రత్యేకాధికారులు విఫలమయ్యారని ఎంపీటీసీలు సభ దృష్టికి తెచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ నీటి సరఫరాలో అధికారులు నిర్లక్ష్యం చేయరాదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శైలజ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీటి సమస్యపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 25 : గ్రామాల్లో నీటి సమస్య ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని, లేకుండా చర్యలు తప్పవని హిమాయత్ నగర్ గ్రామపంచాయతీ కార్యదర్శి సంధ్యకు మొయినాబాద్ ఎంపీడీఓ సంధ్య, మండల మిషన్‌భగీరథ ఏఈ శివకుమార్‌లు చెప్పారు. గ్రామంలో నీటి సమస్య ఉంటే 24 గంటలో సమస్యను పరిష్కరించాలని సూచించారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'వృథాగా పారుతున్న నీరు పట్టించుకోని అధికారులు' అనే కథనానికి స్పందించిన వారు గురువారం గ్రామాన్ని సందర్శించారు. సమస్యకు గల కారణాలను పంచాయతీ కార్యదర్శి సంధ్యను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో కలిసి సమస్యను దగ్గరుండి పరిష్కరించారు. లీకేజీకి గురైన పైపులైనును పునరుద్ధరింపచేశారు. వారం రోజుల నుంచి తాగు నీటి పైపు లైను లీకేజ్ కారణంగా వృథాగా నీరు పోతున్న ఎందుకు పట్టించుకోవడం లేదని పంచాయతీ కార్యదర్శిని వారు ప్రశ్నించారు. ఇలాగే వ్యవహరిస్తే చర్యలు తప్పవని చెప్పారు. కార్యక్రమంలో కారోబార్ శ్రీనివాస్‌గౌడ్, బిల్ కలెక్టర్ షాబాద్ యాదయ్య, సిబ్బంది తదితరులున్నారు.

జేఈఈలో గురుకుల విద్యార్థుల సత్తా

మొయినాబాద్, ఏప్రిల్ 25 : ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన చిలుకూరు సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల కళాశాల విద్యార్థులు గురువారం విడుదలైన జేఈఈ మెయిన్స్‌లో సైతం సత్తాచాటారు. చిలుకూరు సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో ఇంటర్‌తో పాటు ఐఐటీ శిక్షణ కూడా ఇస్తున్నారు. 30 మంది విద్యార్థులు అడ్వాన్స్‌డ్ పరీక్ష రాయగా అందులో 22 మంది విద్యార్దులు అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. 7గురు విద్యార్థులకు 90 పర్సెంటైల్‌కి పైగా మార్కులు వచ్చాయని తెలిపారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను పలువురు అభినందించారు.

మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు

యాచారం, ఏప్రిల్ 25 : మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో హరితహారం కింద లక్ష మొక్కలను నాటాలని, నర్సరీలలో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్త పడాలని యాచారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డి సూచించారు. గురువారం తక్కళ్లపల్లి, తక్కళ్లపల్లితండా, మేడిపల్లి గ్రామాల్లో పర్యటించి రికార్డులను తనిఖీ చేశారు. అంతకు ముందు హరితహారం నర్సరీలను పరిశీలించి మొక్కల సంరక్షణపై పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. వానాకాలంలో మొక్కలు నాటడానికి కార్యదర్శులు ప్రణాళిక రూపొందించాలన్నారు. వంద శాతం పన్నులు వసూలు చేయాలన్నారు. తాగునీటి పైప్‌లెన్ లీక్కవకుండ చూడాలన్నారు. తాగు నీటి పైప్‌లైన్‌లు పాడైడే అతిసార, డయేరియా లాంటి వ్యాధులు ప్రబలే ప్రమాదముందని గుర్తు చేశారు.

ప్రభుత్వ భూమి కబ్జాను ఆపండి

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 25 : హిమాయత్ నగర్ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసి యథేచ్ఛగా రహదారి ఏర్పాటు చేసుకున్న వారిపై చర్యలు తీసుకొని, ప్రభుత్వ భూమిని కాపాడాలని హిమాయత్ నగర్‌కు చెందిన ఎల్లని నవీన్‌కుమార్‌గౌడ్ అనే వ్యక్తి గురువారం మొయినాబాద్ తహసీల్దార్ గౌతంకుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సర్వే నంబర్ 22లోని ప్రభుత్వ భూమిలో ప్రైవేటు వ్యక్తులు రహదారిని ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. దీనిని రెవెన్యూ అధికారులు పరిశీలించి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు.

వైభవంగా శివగంగాదేవిల కల్యాణం



పద్మారంలో హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి

చౌదరిగూడ, ఏప్రిల్ 25 : మండల పరిధిలోని వీరన్నపేట్‌లో శివగంగాదేవి కల్యాణోత్సవ వేడుకలు అంగరంగా వైభవంగా జరిగాయి. గ్రామస్థులు వేడుకలను భక్తి శ్రద్దలతో ఘనంగా నిర్వహించారు. గురువారం జరిగిన కల్యాణ మహోత్సవానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సత్యనారాయణరెడ్డి, రజిత, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు, వెంకటనర్సింహా రెడ్డి, యాదగిరి గౌడ్, సలీం, గంగపుత్ర సంఘం సభ్యులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తి భావాన్ని అలవర్చుకోవాలి

చౌదరిగూడ : సమాజంలో ప్రతీ ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పద్మారంలో కొనసాగుతున్న బొడ్రాయి, నవగ్రహాలు, శ్రీరామచంద్ర మూర్తుల విగ్రహాల ఆవిష్కరణలో భాగంగా నిర్వహిస్తున్న హోమానికి వీర్లపల్లి హాజరయ్యారు. అనంతరం హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దైవ చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఆయన చెప్పారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సత్యనారాయణరెడ్డి, రజిత, రాములు, మండలాధ్యక్షుడు రాజు, వెంకటనర్సింహారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపన

ఆమనగల్లు : గౌరారం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేడుకలు గురువారం వైభవంగా ముగిశాయి. వేడుకల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆలయ అధ్యక్షుడు దోనాదుల వెంకట్రాములు, కార్యదర్శి చిట్టిగోరి భాస్కర్ రావు, ఎంపీటీసీ మంగమ్మ నారాయణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ముగింపు వేడుకల్లో అర్చకులు శ్రీనివాసాచార్యులు, శ్రీనాథాచార్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలు, అతిథులను ఆలయ నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీసీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి అండేకార్ యాదిలాల్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీపాతి రజిత, ఆలయ నిర్వాహకులు, నాయకులు ఆంజనేయులురావు, గంగ శంకరయ్య, సాయిరెడ్డి, అంజిరెడ్డి, పాపిరెడ్డి , అర్జున్ రావు, లక్ష్మణ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు రద్దు చేసేందుకు కుట్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు, ఏప్రిల్ 25 : దేశంలో కుల గణన చేపట్టి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచేందుకు కాంగ్రెస్ కృషి చేస్తుంటే, ఉన్న రిజర్వేషన్లను రద్దు చేసేందుకు బీజేపీ కుట్రలు సాగిస్తున్నదని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆరోపించారు. కడ్తాల మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ పాలనలో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందన్నారు. పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థల కొమ్ము కాసిన మోదీ సర్కార్ పేదల బాగోగులు పట్టించుకోలేదని మండిపడ్డారు. మోదీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే రాజకీయ లబ్ధి కోసం మతాల మధ్య చిచ్చు పెట్టి విద్వేషాలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు చావు దెబ్బ తప్పదన్నారు. అధికారం పోయాక కేసీఆర్‌కు ప్రజలు, వారి బాధలు గుర్తొస్తున్నాయని ఎద్దేవా చేశారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గూడూరు భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొట్ర గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మహేశ్‌యాదవ్ కుటుంబాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు సంజీవ్ యాదవ్, పర్వత్‌రెడ్డి, మోతిలాల్, తదితరులున్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే

ఆమనగల్లు : రోడ్డు ప్రమాదానికి గురైన ఓ వ్యక్తిని తన కారులో ఆసుపత్రికి తరలించి, చికిత్స చేయించి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి మానవత్వం చాటుకున్నారు. గురువారం ఆయన కల్వకుర్తి నుంచి హైదరాబాద్ వెళుతుండగా మార్గ మధ్యలో కడ్తాల వద్ద గోకారం గ్రామానికి చెందని మహేశ్ రోడ్డు ప్రమాదానికి గురికాగా ఎమ్మెల్యే వెంటనే అక్కడికి చేరుకొని పోలీసులకు సమాచారమందించారు. గాయపడ్డ వ్యక్తిని తన కారులో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

రాష్ట్రస్థాయిలో విద్యార్థిని ప్రతిభ



సంజనకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

మంచాల, ఏప్రిల్ 25 : మండల పరిధి జాపాల గ్రామానికి చెందిన బకున సంజన అనే విద్యార్థిని ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్న ఆమె ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో 468 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానంలో సాధించింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల సహకారంతోనే తాను ఈ మార్కులు సాధించినట్లు సంజన తెలిపింది. ఆమె ప్రథమ స్థానం సాధించడం పట్ల సంజన తల్లిదండ్రులు సుకన్య, చంద్రకాంత్ ఆనందం వ్యక్తం చేశారు. వారి కూతురుకు స్వీట్లు తినిపించి సంబరాలు జరుపుకున్నారు.

ప్రయోజకులను చేయడమే లక్ష్యం



విద్యార్థిని అభినందిస్తున్న విక్రమ్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 25 : తమ యూనివర్సిటీలో అభ్యసించే విద్యార్థులను మంచి ప్రయోజకులుగా తయారు చేయడమే లక్ష్యమని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ వైస్‌చైర్మన్ విక్రమ్‌రెడ్డి అన్నారు. ఆ యూనివర్సిటీకి చెందిన మనోజ్‌కుమార్‌రెడ్డి అనే విద్యార్థి సూక్ష్మజీవశాస్త్రంలో 'ఎక్స్‌ప్లోరేషన్ ఆఫ్ కౌంటర్ యాక్షన్ మెకానిజమ్స్ ఆఫర్డ్ బై మైక్రో ఆర్గనిజమ్స్ ఆన్ ఎక్స్‌పోజర్ టు సింథటిక్ కాంపౌండ్స్' అనే అంశంపై ప్రొఫెసర్ బీ.ఎస్ అనురాధ పర్యవేక్షణలో పరిశోధన చేశాడు. విక్రమ్‌రెడ్డి గురువారం యూనివర్సిటీలో మనోజ్‌కుమార్ రెడ్డిని అభినందించారు. విద్యార్థులకు వసతులు కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నట్లు విక్రమ్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్, కంట్రోల్ ఆఫ్ ఎక్జామినేషన్స్ ప్రొఫెసర్ జగదీశ్వర్, రీసర్చ్ డీన్ ఆచార్య క్రిస్టోఫర్, సైన్స్ డీన్ ఆచార్య సుందర్, ప్రొఫెసర్ రాజు, అధ్యాపకులు, పీఆర్వో గాదె రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్వేషాలను రెచ్చ గొడుతున్న బీజేపీ

షాద్‌నగర్, ఏప్రిల్ 25 : లోక్‌సభ ఎన్నికల్లో ఆశించిన సీట్లు రావనే ఉద్దేశంతోనే ప్రజల మధ్య మత విద్వేశాలను బీజేపీ రెచ్చ గొడుతోందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. గురువారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నివాసంలో ఆ పార్టీ నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ సభ్యుడు బాబర్ ఖాన్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి రఘు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయంతోనే నరేంద్రమోదీ విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. మహిళలు ఎంతో పవిత్రంగా భావించే మంగళసూత్రాలతో కూడా రాజకీయండం చేయడం సరికాదన్నారు. దేశ స్వతంత్ర పోరాటంలో, స్వాతంత్రం సిద్ధించాక కాంగెస్ నేతలు, ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ దేశం కోసం ప్రాణాలర్పించారని, అలాంటి వారు బీజేపీలో ఒక్కరయిన ఉన్నారా అని ప్రశ్నించారు.

వంశీచంద్‌రెడ్డి గెలుపునకు కృషి

కేశంపేట : కాంగ్రెస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి గెలుపునకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. మండలంలోని లేమామిడి గ్రామంలోని నాను తండాకు చెందిన పలువురు యువకులు గురువారం ఎమ్మెల్యే నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో అంజినాయక్, స్వామిగౌడ్, మున్నా, సాయి, బాహదూర్, శ్రీకాంత్, దేవ్లా, పవన్, రూప్లానాయక్, తదితరులున్నారు. పార్టీ నాయకులు గూడ వీరేశ్, భాస్కర్‌గౌడ్, ఆంజనేయులు, దిద్దెల లక్ష్మయ్య, అల్వాల ప్రకాశ్‌గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు..

కొందుర్గు : విద్యార్థులు కష్టపడి కాకుండా, ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రం శివారులోని కేజీబీవీలో ఇంటర్మీడియెట్ ఎంపీహెచ్‌డబ్ల్యూ రెండో సంవత్సరంలో 983 మార్కులతో కేజీబీవీలలో స్టేట్ ర్యాంక్‌ను సాధించిన నూకం వింధ్యను గురువారం షాద్‌నగర్ పట్టణంలో ఎమ్మెల్యే తన నివాసంలో ఘనంగా సన్మానించారు. వింధ్య తల్లిదండ్రులు ఎన్ చంద్రకళ, శేఖర్, పాఠశాల ప్రత్యేకాధికారి షకీనా నిస్సీని అభినందించారు. రైతు కుటుంబానికి చెందిన వింధ్య స్టేట్ ర్యాంక్‌ను సాధించడం సంతోషకరమని అన్నారు. పులుసుమామిడి మాజీ సర్పంచ్ షరీఫాబేగంజహంగీర్ కూడా వింధ్యను, ఆమె తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు కె రాములుగౌడ్, అమర్‌నాథ్ రెడ్డి, ఉపాధ్యాయులు జి కల్పన, ఆర్ మల్లేశ్వరి, కె పల్లవి, సి సునిత తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలిన బీజేపీ నాయకులు



నాగర్‌కర్నూల్‌కు తరలుతున్న నాయకులు

ఆమనగల్లు , ఏప్రిల్ 25 : బీజేపీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ నామినేషన్ కార్యక్రమానికి ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఎన్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ఆధ్వర్యంలో నామినేషన్ పెద్ద ఎత్తున జన సమీకరణ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కండె హరిప్రసాద్, గోరటి నర్సింహ, రాంపాల్ నాయక్, దుర్గయ్య, రాందాస్‌నాయక్, మన్యనాయక్, సాయిలాల్ నాయక్, భగీరథ్, మల్లేశ్‌నాయక్, తదితరులు ఉన్నారు.

సేవలను బట్టి సమాజంలో కీర్తి

కడ్తాల్, ఏప్రిల్ 25 : సేవలను బట్టి సమాజంలో కీర్తి లభిస్తుందని డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, జడ్పీటీసీ దశరథ్‌నాయక్, లయన్స్‌క్లబ్ వైస్‌గవర్నర్ మహేందర్ రెడ్డి, మాజీ గవర్నర్ చెన్నకిషన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రం ఎదుట గురువారం గంప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆయన కుమారుడు వెంకటేశ్ అందిస్తున్న సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, లయన్స్‌క్లబ్ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, పిప్పళ్ల వెంకటేశ్, మాజీ సర్పంచ్ హరిచంద్‌నాయక్ పాల్గొన్నారు.

మేడేను విజయవంతం చేయాలి



చేవెళ్లలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మొయినాబాద్/చేవెళ్ల, ఏప్రిల్ 25 : మేడేను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె రామస్వామి అన్నారు. గురువారం మొయినాబాద్‌లో మేడేకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వం వచ్చాక నిత్యావసర వస్తువల ధరలు వందశాతం పెరిగాయని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కె శ్రీనివాస్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి బి ప్రభాకర్, నాయకుల జలీల్, అబ్దుల్ తదితరులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

చేవెళ్ల మండల కేంద్రంలోని ఆర్అండ్‌బి అతిథి గృహం ఆవరణలో ఏఐటీసీయుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల సత్యనారాయణ చారి గురువారం మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకంగా 44 చట్టాలను చేసి మోదీ పెట్టుబడిదారులకు రెడ్ కార్పెట్ వేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బికేఎంయు జిల్లా అధ్యక్షుడు అంజయ్య, నాయకులు డప్పు శివయ్య, సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, తదితరులు ఉన్నారు.

ఉద్యమాలకు సిద్ధం కావాలి

షాద్‌నగర్ : మేడే స్ఫూర్తితో కార్మిక వర్గం ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని జాతీయ రహదారిపై మేడే కార్యక్రమాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎం శ్రీను, లింగం నాయక్, కిషన్ నాయక్, రాజు, పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 25 : ఫరూఖ్‌నగర్ మండలం కాంసాన్‌పల్లి మాజీ సర్పంచ్ పద్మానరేందర్‌రెడ్డి దంపతులు తమ ఉదారతను చాటుకున్నారు. గ్రామానికి చెందిన బైడ్ల లక్ష్మయ్యకు ఉండడానికి ఇల్లు లేకపోవడంతో అతని ఇంటి నిర్మాణానికి తమ వంతుగా రూ. 25 వేల నగదును గురువారం అందించారు.

● **కేశంపేట** : మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి ఉదారతను చాటుకున్నారు. గ్రామానికి చెందిన కుమ్మరి లలిత-చంద్రకాంత్ కూతురు కావేరి వివాహం గురువారం జరుగగా, విష్ణువర్ధన్‌రెడ్డి పుస్తె, మట్టెలను అందించారు. తన వంతుగా సహకారమందించడం సంతృప్తినిచ్చిందని విష్ణువర్ధన్‌రెడ్డి చెప్పారు.

● **చేవెళ్ల** : తెలంగాణ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా చేవెళ్ల మండలనికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు ఆంజనేయులుగౌడ్ నియమితులైయ్యారు. ఈ మేరకు గురువారం బీజేపీ పార్టీ నాయకులు చేవెళ్ల మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆంజనేయులుగౌడ్‌ను ఘనంగా సన్మానించారు. తన ఎంపికకు సహకరించిన పార్టీ పెద్దలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, చేవెళ్ల మండల బీజేపీ ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, సీనియర్ నాయకులు అదెట్లా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

●**తలకొండపల్లి** : బీజేవైఎం కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్‌గా నియమితులైన తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన పద్మ అనిల్‌ను గురువారం బీజేపీ నాయకులు అభినందించారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సాయిరామ్, పద్మ గణేశ్, రాజు, సుధాకర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

● **తలకొండపల్లి** : విద్యతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం, ఉన్నత జీవితం లభిస్తుందని బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ప్రతిభకు పేదరికం అడ్డుకాదని, ప్రతిభావంతులకు ప్రతి ఒక్కరు చేయూతనందించి ప్రోత్సహించాలని ఆయన కోరారు. తలకొండపల్లి మండల కేంద్రానికి చెందని నూకం చంద్రకళశేఖర్ దంపతుల కుమార్తె వింధ్య ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 983 మార్కులు సాధించి కేజీబీవీ పాఠశాలల్లో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. గురువారం తలకొండపల్లి మండల కేంద్రంలో వింధ్యకు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మధు, మల్లేశ్‌యాదవ్, బాల్‌రాజ్, మధుయాదవ్, వెంకటయ్య, పాండు తదితరులు పాల్గొన్నారు.

● **ఆమనగలు** : సమాజ శాంతిని కాంక్షించి ప్రతి ఒక్కరు దైవ భక్తిని అలవరుచుకోవాలని ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, కడ్తాల సీఐ శివప్రసాద్ అన్నారు. సన్మార్గంతో ముందుకు సాగే వారు జీవితంలో ఆనందంగా, ఉన్నతంగా రాణిస్తారని వారు చెప్పారు. గౌరారం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయాన్ని గురువారం వారు సందర్శించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు వెంకట్రాములు, కార్యదర్శి చిట్టిగోరి భాస్కర్‌రావు వారిని సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై బాల్‌రామ్‌నాయక్, ఎంపీటీసీ నిట్ల మంగమ్మ నారాయణ, మాజీ సర్పంచ్ పర్వతాలు, నిర్వాహకుడు చిట్టిగోరి భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వ్యక్తి అదృశ్యం



చెన్నయ్య

శంషాబాద్ రూరల్ 25 : మండలంలోని పెద్ద షాపూర్‌కు చెందిన వడ్డెమోని చెన్నయ్య(58) అనే వ్యక్తి ఈ నెల 23న రాత్రి వేళ 11.30 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లి పోయాడు. వివరాలిలా ఉన్నాయి. చుట్టుపక్కల. బంధువుల ఇళ్లలో వెతికినా అతని జాడ తెలియకపోవడంతో గురువారం అతని కుమారుడు శ్రీకాంత్ శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంటి నుంచి వెళ్లే సందర్భంలో చెన్నయ్య పింక్ కలర్ చొక్కా, బ్లూకలర్ ప్యాంట్ ధరించాడని, తెలుగులో మాట్లాడతాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అతని ఆచూకి తెలిస్తే 8639073064 నెంబర్‌కు కాల్ చేసి సమాచారమివ్వాలని పోలీసులు చెప్పారు.

ప్రమాదవశాత్తు మిషన్‌లో పడి మహిళ మృతి

చౌదరిగూడ, ఏప్రిల్ 25 : కూలీ పని కోసం వచ్చిన ఓ మహిళ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ జొన్నల మిషన్‌లో పడి మృతి చెందిన ఘటన తుమ్మలపల్లిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొందుర్గు మండలం అయోధ్యపూర్ తండాకు చెందిన కేతావత్ చంద్యా(32) అనే మహిళ కూలీ పని కోసం జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లికి వచ్చింది. గురువారం సాయంత్రం జొన్న కంకి మిషన్‌లో వేస్తుండగా ప్రమాదవశాత్తు మిషన్‌లో పడి ఆమె మృతి చెందింది. విషయాన్ని గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ కిషన్‌నాయక్ మిషన్‌ను నిలిపివేశాడు. తోటి కూలీలు అక్కడి వచ్చి చూసే సరికి ఆమె విగతా జీవిగా పడివుందని తెలిపారు. మహిళ చనిపోవడంతో డ్రైవర్ ట్రాక్టర్‌ను అక్కడే వదిలి చౌదరిగూడ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. వెంటనే ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని ప్రమాద ఘటన వివరాలను సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

భక్తులపై వ్యాపారుల దాడి : కేసు నమోదు

కొత్తూర్, ఏప్రిల్ 25 : దర్శనం కోసం వచ్చిన భక్తులపై వ్యాపారులు దాడి చేసిన ఘటన గురువారం ఉదయం కొత్తూర్ మండల పరిధిలోని జేపి దర్గాలో చోటు చేసుకుంది. గురువారం హైదరాబాద్ నారానిగూడకు చెందిన ఎనుగంటి రాజు కుటుంబ సభ్యులతో కలిసి జేపి దర్గాకు దర్శనం కోసం వచ్చాడు. దర్గాకు వస్తుంటే దారిలో ఎండీ బాబుమీయా పంక్షన్ హాల్ వద్ద రాజు కారును అడ్డగించి తమ పంక్షన్ హాలుకు రావాలంటూ వత్తిడి చేస్తు గొడవకు దిగాడు. జేపీ దర్గాలో ప్రత్యేక పూజలు చేసేందుకు వెళ్తున్న రాజును అడ్డగించి అసభ్య పదజాలంతో తిట్టి, దాడి చేసి కొట్టారు. షేక్ బురాన్, సయ్యద్ జమీన్‌పై భక్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.


కబ్జాకు గురైన పార్క్ స్థలాన్ని కాపాడాలి



ఎస్సైకి ఫిర్యాదు అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు , ఏప్రిల్ 25 : కబ్జాకు గురైన పార్క్ స్థలాన్ని కాపాడాలని ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విఠాయిపల్లి స్థానిక నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం స్థానిక ఎస్సై బాల్ రామ్‌నాయక్‌కు ఫిర్యాదును అందజేశారు. విఠాయిపల్లిలోని సర్వే నెంబర్లు 56, 57, 59లో గల 3.20 ఎకరాల భూమిలో 2007లో వెంచర్ చేయడం జరిగిందని ఫిర్యాదు లో పేర్కొన్నారు. అట్టిభూమిలో 10 శాతం భూమిని నిబంధనల మేరకు గ్రామ పంచాయతీకి కేటాయించడం జరిగిందని, ఆ భూమిలో పార్క్ ఏర్పాటుకు నిర్ణయించడం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. మున్సిపాలిటీ ఏర్పాటయ్యాక ఆ వెంచర్ నిర్వాహకుడు తప్పుడు పత్రాలు సృష్టించి పార్క్ కు కేటాయించిన స్థలాన్ని కబ్జా చేసి ప్లాట్లుగా మార్చి విక్రయించేందుకు ప్రయత్నించగా అప్పట్లో మున్సిపల్ కమిషనర్, పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఇటీవల అదే స్థలాన్ని మళ్లీ వెంచర్ నిర్వాహకుడు కబ్జా చేసి విక్రయానికి ప్రయత్నిస్తున్నాడని గ్రామస్థులు తెలిపారు. పార్క్ స్థలాన్ని కాపాడాలని కోరారు. కౌన్సిలర్ సుజాతరాములు, మాజీ సర్పంచ్‌లు సాలయ్య, పర్వతాలు, నాయకులు శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, కిశోర్, నర్సింహ్మా, పూల్యానాయక్, రవి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో మూడో సారీ బీజేపీ సర్కారే



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కేశంపేట, ఏప్రిల్ 25 : కేంద్రంలో మూడోసారీ బీజేపీ సర్కారే అధికారంలోకి వస్తుందని, మోదీ మరోమారు ప్రధానిగా బాధ్యతలు తీసుకుంటారని బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి యం. శివాజీ విశ్వాసం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో గురువారం 119, 120 బూత్‌లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలో బీజేపీ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించి, డీకే అరుణకు ఓటు వేయాలని కోరారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం

కొందుర్గు : మండల కేంద్రంలో గురువారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 10 సంవత్సరాల్లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను ఓటర్లకు అందజేశారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి, ఆ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకె అరుణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బోయ శంకర్, బి శ్రీశైలం, మహేశ్, భిక్షపతి, అఖిల్, శ్రీకాంత్, వంశీ, భాను, చింటు, శేఖర్, యాదయ్య, నర్సింలు, శ్రీను, వీరయ్య, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మాడ్గుల, ఏప్రిల్ 25 : వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోగాలు దరి చేరకుండా జాగ్రత్త పడాలని మాడ్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ మోహన్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండటంతో ఈగలు, దోమలు పెరిగి రోగాల బారిన పడుతారని హెచ్చరించారు. దోమలతో మలేరియా, డెంగీ, విషజ్వరాల బారిన పడకుండా ప్రతి వ్యక్తి పరిశుభ్రత పాటించాలని సూచించారు. సూపర్‌వైజర్ దయాకర్, ల్యాబ్ టెక్నీషియన్ మనోహర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● శుక్రవారం 26 ఏప్రిల్ 2024



ఇఫ్లూలో
పీజీ డిప్లొమా, పీహెచ్‌డీ

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సులు, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. హైదరాబాద్ సహా షిల్లాంగ్, లఖ్‌నవూ క్యాంపస్‌లలో ఈ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఎంట్రెన్స్ టెస్ట్‌లో అర్హత పొందాలంటే కనీసం 50 శాతం మార్కులు రావాలి. పీజీ డిప్లొమా కోర్సు వ్యవధి ఏడాది. ఇందులో రెండు సెమిస్టర్లు ఉంటాయి. పీహెచ్‌డీ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఇఫ్లూ దూరవిద్య విధానంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ కోర్సును కూడా అందిస్తోంది.

పీజీ డిప్లొమా ఇన్ టీచింగ్ ఆఫ్ ఇంగ్లీష్: హైదరాబాద్ క్యాంపస్‌లో 40, లఖ్‌నవూ క్యాంపస్‌లో 20 సీట్లు ఉన్నాయి.
అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఎంఏ(ఇంగ్లీష్/ఇంగ్లీష్ లిటరేచర్/లింగ్విస్టిక్స్/టీఈఎస్ఎల్/ఈఎల్‌టీ) ఉత్తీర్ణులై ఉండాలి.
పీజీ డిప్లొమా ఇన్ టీచింగ్ ఆఫ్ అరబిక్: హైదరాబాద్ క్యాంపస్‌లో 20 సీట్లు ఉన్నాయి.
అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఎంఏ(అరబిక్/అరబిక్ లిటరేచర్/లింగ్విస్టిక్స్/టీచింగ్ ఆఫ్ అరబిక్) పూర్తిచేసి ఉండాలి.
పీజీ డిప్లొమా ఇన్ ట్రాన్స్‌లేషన్: హైదరాబాద్ క్యాంపస్‌లో 20 సీట్లు ఉన్నాయి.
అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఎంఏ(ఇంగ్లీష్) ఉత్తీర్ణతతోపాటు ఏదేని ఇండియన్/ఫారిన్ లాంగ్వేజ్ చదవడం, రాయడంలో ప్రావీణ్యం ఉండాలి.
పీజీ డిప్లొమా ఎంట్రెన్స్ టెస్ట్: పరీక్ష సమయం రెండు గంటలు. మొత్తం మార్కులు 100. పీజీ డిప్లొమా ఇన్ టీచింగ్ అరబిక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో అరబిక్ లాంగ్వేజ్‌కు సంబంధించి 75, సబ్జెక్ట్ స్పెసిఫిక్ నాలెడ్జ్‌కు సంబంధించి 25 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. పీజీడీటీఈ, పీజీడీటీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నిర్వహించే టెస్ట్‌లో ఇంగ్లీష్ లాంగ్వేజ్ ప్రొఫిషియెన్సీ నుంచి 50, సబ్జెక్ట్-స్పెసిఫిక్ నాలెడ్జ్ నుంచి 50 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు.
పీజీ డిప్లొమా స్కాలర్‌షిప్‌లు: కుటుంబ వార్షికాదాయం రూ.1,50,000లు మించనివారికి మెరిట్ కమ్ మీన్స్ ఫెలోషిప్ కింద ట్యూషన్ ఫీజు మినహాయిస్తారు. బుక్ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1000లు ఇస్తారు. సోషల్ వెల్ఫేర్ సంస్థలు/రాష్ట్ర ప్రభుత్వాలు/ మినిస్ట్రీ ఆఫ్ ట్రైబల్ అఫైర్స్/యూజీసీ నుంచి ప్రతినెలా రూ. 1000లకు పైగా స్కాలర్‌షిప్ పొందుతున్న అభ్యర్థులకు ఇవి వర్తించవు. ఈ మొత్తం రూ. 1000 కన్నా తక్కువగా ఉంటే మిగిలినదాన్ని ఇఫ్లూ ఇస్తుంది.
పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ ఇన్ టీచింగ్ ఆఫ్ ఇంగ్లీష్: ఈ డిస్టెన్స్ ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. అడ్మిషన్ టెస్ట్, వయోపరిమితి నిబంధనలు లేవు.
అర్హత: ఎంఏ(ఇంగ్లీష్/లింగ్విస్టిక్స్/ఎడ్యుకేషన్/మాస్ కమ్యూనికేషన్/సైకాలజీ/క్రిటికల్ హ్యూమానిటీస్/ లిబరల్ ఆర్ట్స్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
దరఖాస్తు ఫీజు+ప్రోగ్రామ్ ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.6,820; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,070; దివ్యాంగులకు రూ.1,320

పీహెచ్‌డీ: విభాగాలు-సీట్లు: ఇంగ్లీష్ లిటరేచర్ 7, కంపారేటివ్ లిటరేచర్ 3, ఇండియన్ అండ్ వరల్డ్ లిటరేచర్స్ 6, ట్రాన్స్‌లేషన్ స్టడీస్ 3, హిందీ 5, ఇంగ్లీష్ లాంగ్వేజ్ ఎడ్యుకేషన్ 16, ఎడ్యుకేషన్ 1, లింగ్విస్టిక్స్ అండ్ ఫొనెటిక్స్ 18, ఈస్థటిక్స్ అండ్ ఫిలాసఫీ 1, కల్చరల్ స్టడీస్ 8, ఫిల్మ్ స్టడీస్ అండ్ విజువల్ కల్చర్ 6, మీడియా అండ్ కమ్యూనికేషన్ 18, ఫ్రెంచ్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ 8, రష్యన్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ 5, జర్మన్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ 3, స్పానిష్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ 4, అరబిక్ లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ 9 సీట్లు ఉన్నాయి.
అర్హత: విభాగాన్ని అనుసరించి (ఎంఏ/ఎంఫిల్)(ఇంగ్లీష్/కంపారేటివ్ లిటరేచర్/ట్రాన్స్‌లేషన్ స్టడీస్/హిందీ/టీఈఎస్ఎల్/ఈఎల్‌టీ/ఎడ్యుకేషన్/కల్చరల్ స్టడీస్/ఫిల్మ్ స్టడీస్/కమ్యూనికేషన్/ఈస్థటిక్స్/ఫిలాసఫీ/విజువల్ ఆర్ట్స్/కల్చర్/లీగల్ స్టడీస్/ఆంత్రోపాలజీ/హిస్టరీ/పొలిటికల్ సైన్స్/సోషియాలజీ/సోషల్ వర్క్/మీడియా స్టడీస్/జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్/ లింగ్విస్టిక్స్/ఫొనెటిక్స్/అప్లయిడ్ లింగ్విస్టిక్స్/ఫ్రెంచ్/రష్యన్/జర్మన్/స్పానిష్/ అరబిక్) లేదా ఎంఫిల్ ఇంగ్లీష్(కామన్వెల్త్ లిటరేచర్/ఇంగ్లీష్ లిటరేచర్/ కంపారేటివ్ లిటరేచర్) ఉత్తీర్ణులై ఉండాలి.
- యూజీసీ(నెట్/జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్) అర్హత ఉన్నవారు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు. వీరిని నేరుగా ఇంటర్వ్యూకి పిలుస్తారు. ఇంటర్వ్యూకి 30 మార్కులు కేటాయించారు. ఇందులో సాధించిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు.
- **ఎంట్రెన్స్ టెస్ట్:** పరీక్ష సమయం రెండు గంటలు. సంబంధిత సబ్జెక్ట్, రీసెర్చ్ మెథడాలజీల నుంచి ఒక్కోదానిలో 35 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మొత్తం మార్కులు 70.
- **ఫెలోషిప్:** నెట్ అర్హత లేని వారికి నెలకు రూ.8000ల ఫెలోషిప్‌తోపాటు కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.8000 ఇస్తారు. జేఆర్ఎఫ్ అర్హత ఉన్నవారికి నెలకు రూ.31000ల ఫెలోషిప్, రూ.7440ల హెచ్ఆర్ఏ, ఏడాదికి రూ.10000ల కంటింజెన్సీ గ్రాంట్ ఇస్తారు. ఎస్ఆర్ఎఫ్ అర్హత ఉన్నవారికి నెలకు రూ.35,000ల ఫెలోషిప్, రూ.8400ల హెచ్ఆర్ఏ, ఏడాదికి రూ.20,500ల కంటింజెన్సీ గ్రాంట్ ఇస్తారు.

ముఖ్య సమాచారం
- **ఎంట్రెన్స్ టెస్ట్ ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** పీజీసీటీఈకి మే 10; పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు మే 8.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూన్ 8
- **వెబ్‌సైట్:** efluniversity.ac.in

ఐఐఎఫ్‌టీ
ఆన్‌లైన్‌లో ఎంబీఏ(ఐబీ)


న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ) - ఎంబీఏ(ఇంటర్నేషనల్ బిజినెస్) ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఆన్‌లైన్ విధానంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.
ప్రోగ్రామ్ వివరాలు: ఈ ప్రోగ్రామ్‌ను వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించారు. దీని వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి ఏడాది మేనేజ్‌మెంట్ స్ట్రాటజీ, ట్రేడ్ అండ్ ఫైనాన్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్సెస్ కోర్సులు చదవాల్సి ఉంటుంది. రెండో ఏడాది ఫైనాన్స్, ట్రేడ్, మార్కెటింగ్, స్ట్రాటజీ, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎకనామిక్స్ స్పెషలైజేషన్‌లలో ఒకదాన్ని ఎంచుకోవాలి. ప్రోగ్రామ్‌లో భాగంగా వర్చువల్ సెషన్స్ ఉంటాయి. ప్రముఖ పారిశ్రామిక నిపుణులు గెస్ట్ లెక్చర్స్ ఇస్తారు. కేస్ స్టడీస్, ప్రాబ్లం సాల్వింగ్ విధానాలపై బృంద చర్చలు ఉంటాయి. వారాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఆన్‌లైన్ సెషన్స్ నిర్వహిస్తారు.
అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు. కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.



ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** రూ.3,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

ఐఎల్‌బీఎస్‌లో అకడమిక్ ప్రోగ్రామ్‌లు

న్యూఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లివర్ & బైలరీ సైన్సెస్(ఐఎల్‌బీఎస్) - వివిధ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. పీహెచ్‌డీ, పీడీసీసీ, పీజీసీసీ, సర్టిఫికెట్ కోర్సులు సహా ఫెలోషిప్ ప్రవేశాలు నిర్వహించనున్నారు. ఆల్ ఇండియా ఎంట్రెన్స్ టెస్ట్, డిపార్ట్‌మెంటల్ అసెస్‌మెంట్/ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. పీహెచ్‌డీ వ్యవధి 3 నుంచి 5 సంవత్సరాలు. పోస్ట్ డాక్టోరల్ సర్టిఫికెట్ కోర్సులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు, ఫెలోషిప్‌ల వ్యవధి ఏడాది. కొన్ని పీజీసీసీ కోర్సులు, ఇతర సర్టిఫికెట్ కోర్సుల వ్యవధి ఆర్నెల్లు.



సీట్లు: అన్ని కోర్సుల్లో కలిపి మొత్తం సీట్లు 91. పీహెచ్‌డీ కోర్సులో 13 సీట్లు ఉన్నాయి. వీటిలో మాలిక్యులార్ అండ్ సెల్యులార్ మెడిసిన్‌లో 4, హెపటాలజీలో 2, క్లినికల్ న్యూట్రిషన్‌లో 1, వైరాలజీలో 1, నర్సింగ్‌లో 5 సీట్లు ఉన్నాయి. పీడీసీసీ కోర్సులో 47 సీట్లు ఉన్నాయి. వీటిలో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ అనెస్తీషియా 3, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ 3, హెపటోపాథాలజీ 3, నెఫ్రాలజీ 3, ట్రాన్స్‌ప్లాంట్ వైరాలజీ 3, డయాగ్నస్టిక్ వైరాలజీ 1, క్రిటికల్ కేర్ మెడిసిన్ 3, జీఐ మెడికల్ అంకాలజీ 3, హెచ్‌పీబీ అండ్ జీఐ అడ్వాన్స్‌డ్ రేడియేషన్ అంకాలజీ 3, గ్యాస్ట్రో రేడియాలజీ 3, బ్లడ్ బ్యాంకింగ్ అండ్ ఇమ్యూనోహెమటాలజీ 3, అడ్వాన్స్‌డ్ డయాగ్నస్టిక్ అండ్ క్లినికల్ మైక్రోబయాలజీ 3, అఫెరిసిస్ టెక్నాలజీ అండ్ బ్లడ్ కాంపొనెంట్ థెరపీ 3, సెల్యులార్ ట్రాన్స్‌ప్లాంట్ ఇమ్యూనాలజీ 1, హెపటాలజీ 4, అడ్వాన్స్‌డ్ క్లినికల్ బయోకెమిస్ట్రీ 2, హెపటో-హెమటాలజీ 1, పల్మనరీ-క్రిటికల్ కేర్-స్లీప్ మెడిసిన్ 2 సీట్లు ఉన్నాయి. పీజీసీసీ కోర్సులో 17 సీట్లు ఉన్నాయి. వీటిలో క్లినికల్ న్యూట్రిషన్ 2, ఎపిడిమియాలజీ ఆఫ్ వైరల్ హెపటైటిస్ అండ్ లివర్ డిసీజెస్ 1, క్లినికల్ రీసెర్చ్ ఇన్ లివర్ డిసీజెస్ 2, క్లినికల్ బయో ఇన్ఫర్మాటిక్స్ 10, డయాలిసిస్ థెరపీ 2 సీట్లున్నాయి. అడ్వాన్స్‌డ్ హెపటాలజీలో 2 ఫెలోషిప్‌లు ఉన్నాయి. సర్టిఫికెట్ కోర్సుల్లో క్రిటికల్ కేర్ 2, బయోస్టాటిక్స్ 10 సీట్లు ఉన్నాయి.
అర్హత వివరాలు: పీహెచ్‌డీ కోర్సుకు ప్రథమ శ్రేణి మార్కులతో ఎంబీబీఎస్/మాస్టర్స్ డిగ్రీ(మెడికల్/డెంటల్ సైన్సెస్)/ఎంటెక్/ఎంఫార్మసీ/ఎంవీఎస్సీ/ఎమ్మెస్సీ నర్సింగ్/ఎంఫిల్ నర్సింగ్/మాస్టర్స్ డిగ్రీ(బయోలాజికల్ సైన్సెస్-(బయో కెమిస్ట్రీ/బయోటెక్నాలజీ/లైఫ్ సైన్సెస్/జువాలజీ/మైక్రోబయాలజీ)) ఉత్తీర్ణులై ఉండాలి. సీఎస్ఐఆర్/యూజీసీ నెట్ జేఆర్ఎఫ్, డీబీటీ జేఆర్ఎఫ్, ఐసీఎంఆర్ జేఆర్ఎఫ్ ఉన్న అభ్యర్థులు ఎంట్రెన్స్ ఎగ్జామ్ రాయనవసరం లేదు. వీరిని నేరుగా ఇంటర్వ్యూకి అనుమతిస్తారు. పీడీసీసీ కోర్సుకు సంబంధిత విభాగంలో ఎండీ/డీఎన్‌బీ ఉత్తీర్ణులై ఉండాలి. పీజీసీసీ కోర్సుకు విభాగాన్ని అనుసరించి ఎమ్మెస్సీ/ఎంబీబీఎస్/బీఏఎంఎస్/బీహెచ్‌ఎంఎస్/బీడీఎస్/ఎమ్మెస్సీ-లైఫ్ సైన్సెస్/ఎమ్మెస్సీ-స్టాటిస్టిక్స్/బీఎస్సీ-నర్సింగ్ ఉత్తీర్ణులై ఉండాలి. సర్టిఫికెట్ కోర్సులకు ఎంబీబీఎస్/పీజీ(సైన్స్/ఎకనామిక్స్/సోషియాలజీ/స్టాటిస్టిక్స్/సైకాలజీ/ఫిజియోథెరపీ); ఫెలోషిప్‌లకు డీఎం/డీఎన్‌బీ(గ్యాస్ట్రో ఎంటరాలజీ) పూర్తిచేసి ఉండాలి.
ఎంపిక: పీహెచ్‌డీ కోర్సుకు నిర్వహించే ప్రవేశ పరీక్షలో 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నలన్నీ పీజీ స్థాయిలో ఉంటాయి. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం గంటన్నర. ఇందులో అర్హత సాధించాలంటే కనీసం 50 శాతం మార్కులు రావాలి. అర్హత పొందిన అభ్యర్థులను 1:5 నిష్పత్తిలో ఎంపిక చేసి ఇంటర్వ్యూ/డిపార్టుమెంటల్ అసెస్‌మెంట్‌కు పంపుతారు. నెట్ అర్హత ఉన్నవారికి వ్యాలిడ్ జేఆర్ఎఫ్‌కు 30 మార్కులు, ఆర్నెల్ల పరిశోధన అనుభవానికి 20 మార్కులు, ప్రజంటేషన్‌కు 10 మార్కులు, ఇంటర్వ్యూకి 40 మార్కులు వెయిటేజీ ఇస్తారు. పీడీసీసీ/పీజీసీసీ/ఫెలోషిప్/సర్టిఫికెట్ కోర్సుల ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో నిర్దేశిత సబ్జెక్టుల నుంచి నిర్దేశించిన మేరకు ప్రశ్నలు ఇస్తారు. రాత పరీక్ష స్కోర్‌కు 70 శాతం, డిపార్టుమెంటల్ అసెస్‌మెంట్/ఇంటర్వ్యూకి 30 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 12
- **రిటెన్ ఎగ్జామినేషన్:** మే 26
- **డిపార్ట్‌మెంటల్ అసెస్‌మెంట్:** మే 27
- **కోర్సులు ప్రారంభం:** జూలై 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.ilbs.in

జాబ్ కార్నర్

సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (అసిస్టెంట్ కమాండెంట్) ఎగ్జామ్ 2024

మొత్తం ఖాళీలు: 506

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్... సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్(అసిస్టెంట్ కమాండెంట్) ఎగ్జామినేషన్-2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్ష ద్వారా బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్, ఇండో-టిబెటిన్ బోర్డర్ పోలీస్, సశస్త్ర సీమాబల్‌లో అసిస్టెంట్ కమాండెంట్ల(గ్రూప్ ఎ) ఉద్యోగాలు భర్తీ చేస్తారు. అర్హులైన పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
మొత్తం ఖాళీలు: 506(బీఎస్ఎఫ్-186, సీఆర్‌పీఎఫ్-120, సీఐఎస్ఎఫ్-100, ఐటీబీపీ-58, ఎస్ఎస్‌బీ-42)
అర్హత: బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు నిర్దిష్ట శారీరక, వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 20 నుంచి 25 సంవత్సరాల మధ్య ఉండాలి.
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష(పేపర్-1, పేపర్-2), ఫిజికల్ స్టాండర్డ్స్/ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ/పర్సనాలిటీ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.
దరఖాస్తు రుసుము: రూ.200. ఎస్సీ, ఎస్టీ, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.
తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం
దరఖాస్తుకు చివరి తేదీ: మే 14
రాత పరీక్ష తేదీ: ఆగస్టు 4
వెబ్‌సైట్: https://upsc.gov.in/



నేవల్ డాక్‌యార్డ్‌లో అప్రెంటిస్‌లు

మొత్తం ఖాళీలు: 301

భారత నౌకాదళానికి చెందిన ముంబయిలోని మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్(నేవీ), నేవల్ డాక్‌యార్డ్ అప్రెంటిస్ స్కూల్... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
1. ఏడాది అప్రెంటిస్‌షిప్ ట్రెయినింగ్: **288 ఖాళీలు**
2. రెండేళ్ల అప్రెంటిస్‌షిప్ ట్రెయినింగ్: **13 ఖాళీలు**

ట్రేడులు: ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రోప్లేటర్, ఫిట్టర్, ఫౌండ్రీమన్, మెకానిక్(డీజిల్), ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, మెషినిస్ట్, ఎంఎంటీఎం, పెయింటర్(జి), ప్యాటర్న్ మేకర్, పైప్ ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెకానిక్ రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ, షీట్ మెటల్ వర్కర్, షిప్‌రైట్(ఉడ్), టైలర్(జి), వెల్డర్(జి అండ్ ఇ), మేసన్(బీసీ), ఐ అండ్ సీటీఎస్ఎం, షిప్ రైట్(స్టీల్), రిగ్గర్, ఫోర్జర్ అండ్ హీట్ ట్రీటర్.
అర్హత: ఎనిమిది, పదో తరగతితోపాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
వయోపరిమితి: కనిష్ఠ వయసు 14 ఏళ్లు, గరిష్ఠ వయోపరిమితి లేదు.
ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ/స్కిల్ టెస్ట్‌లో వచ్చిన మార్కులు, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మే 10
వెబ్‌సైట్: https://indiannavy.nic.in/

ఏఆర్ఐలో స్టెనోగ్రాఫర్స్

భారత ప్రభుత్వ రంగ సంస్థకు చెందిన పుణెలోని మహారాష్ట్ర అసోసియేషన్ ఫర్ ద కల్టివేషన్ ఆఫ్ సైన్స్ - అగార్కర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎంఏసీఎస్-ఏఆర్ఐ)... డైరెక్ట్/డిప్యూటేషన్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
1. ప్రైవేట్ సెక్రటరీ: **2 పోస్టులు**
2. స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 2: **2 పోస్టులు**

అర్హత: ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణతతో పాటు టైపింగ్ స్పీడ్ ఉండాలి.
జీతం: ప్రైవేట్ సెక్రటరీ పోస్టుకు రూ.44,900 - రూ.1,42,400. స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 2 పోస్టుకు రూ.25,500 - రూ.81,100.
వయోపరిమితి: స్టెనోగ్రాఫర్ పోస్టుకు 27 ఏళ్లు మించరాదు. ప్రైవేట్ సెక్రటరీ పోస్టుకు 56 ఏళ్లు మించరాదు.
ఎంపిక విధానం: స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
దరఖాస్తు చివరి తేదీ: మే 6
వెబ్‌సైట్: https://aripune.org/

లిటిల్స్



మీకు తెలుసా?

- పొడవైన తోక, చూడటానికి గంభీరంగా... మెడ కిందిభాగంలో ఎరుపు, తల మీద బంగారు రంగు ఉంటుంది. మెడ చుట్టూ చీరనేసినట్టుండే అందం... మొత్తానికి చూడటానికి ఫస్ట్‌లుక్‌లో నెమలిలా ఉండే ఈ పక్షి పేరు 'గోల్డెన్ ఫీజంట్'. భూమ్మీద ఉండే అందమైన పక్షుల్లో ఇదొకటి. విచిత్రమేంటంటే ఇవి.. మగ పక్షులు. ఆడపక్షులు నలుపు, బ్రౌన్ కలర్‌లో ఉంటాయి.
- వీటి పుట్టినిల్లు చైనా. కొండప్రాంతాల్లో తిరుగుతుంటాయివి. బరువు 600 గ్రాములు ఉంటాయి. ఇక మగపక్షులు 90 నుంచి 100 సెంటీమీటర్ల పొడవుంటే.. ఆడపక్షులు 70 నుంచి 80 సెం.మీ పొడవు ఉంటాయి.



- ఈ పక్షులు తెలివైనవి. అయితే సహనం కూడా వీటికి ఎక్కువ. అయితే ఒక్కోసారి మగపక్షులకు కోపం ఎక్కువ వస్తుంది. ఎంత అంటే ఆడపక్షులను చంపేస్తాయి. అయితే ఇది చాలా అరుదుగా జరుగుతుంది. ఇవి గాల్లోకి మరీ ఎత్తుకు ఎగరలేవు. అయితే వేగంగా పరిగెత్తగలవు.
- చలి, వేడి ప్రాంతాల్లో కూడా బతకగలవు. వీటిని పెంచుకోవచ్చు కూడా.
- ఈ పక్షుల గుడ్లు బాతు గుడ్లంత ఉంటాయి. మట్టిలో కంటే గడ్డిమీద గుడ్లు పెట్టటానికి ఇష్టపడతాయి. 5 నుంచి 12 గుడ్లు వరకూ పెడతాయి. ఇవి పొదిగే కాలం మూడు వారాలు.

జత లేని బొమ్మ ఏది?




సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



5 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 291

3		4			1			7
	5							
			6					8
6			9			2	7	3
			8		7			
2	1	7			3			5
5					4			
							9	
1			2			4		6

సుడోకు - 290 సమాధానం

6	7	2	9	1	3	4	8	5
8	1	9	4	2	5	7	3	6
3	4	5	6	7	8	9	2	1
9	2	8	5	6	4	1	7	3
7	6	1	8	3	2	5	9	4
5	3	4	7	9	1	2	6	8
1	9	7	3	4	6	8	5	2
2	5	3	1	8	7	6	4	9
4	8	6	2	5	9	3	1	7

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.